# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :285 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 23-01-2025 | పేజీలు:4 వెల: 2.00


## గన్నవరం ఎయిర్‌పోర్టులో దట్టమైన పొగమంచు..

### విమానాల రాకపోకలకు అంతరాయం

అమరావతి : ఏపీలోని విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్టులో బుధవారం ఉదయం దట్టమైన పొగమంచు కారణంగా విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు విశాఖ ఢిల్లీ నుంచి వచ్చే విమానాలు ఆలస్యంగా ప్రయాణిస్తున్నాయి.

విమానాల ఆలస్యంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా గన్నవరం విమానాశ్రయానికి రావాల్సిన పలు సర్వీసులను రద్దు చేశారు. కొన్ని రోజులుగా ఉత్తరాది రాష్ట్రాల్లో చలితీవ్రత పెరుగడంతో రెండురోజులుగా పొగమంచు వాతావరణాన్ని కమ్మేస్తోంది.

## తులం బంగారం ఎప్పుడిస్తారని ప్రజలు అడుగుతున్నారు : ఎమ్మెల్యే తలసాని



హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తులం బంగారంఎప్పుడిస్తారని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు. బుధవారం సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో 108 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తులం బంగారం కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.%ఎన్నికల ముందు తులం బంగారం ఇస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడాది దాటినా తులం బంగారం ఇవ్వడం లేదు. ఇచ్చిన హామీని ఎప్పుడు నిలుపుకుంటారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత విధానాలపై బీఆర్ఎస్ పార్టీ తరపున నిరంతరం పోరాడుతామన్నారు.

## కార్యాలయాలు, ఇండ్లపైకి వస్తామంటే భయపడేది లేదు : కవిత



కాంగ్రెస్ నాయకులు ఖబర్దార్ అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలు, ఇండ్లపైకి దాడులకు వస్తామంటే భయపడే ప్రసక్తే లేదంటూ హెచ్చరించారు. యాదాద్రి భోనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 60లక్షల మంది సైనికులు ఉన్న కుటుంబం బీఆర్ఎస్ పార్టీ అని.. కార్యకర్తలు తలచుకుంటే కాంగ్రెస్ నాయకులు తిరిగే పరిస్థితి ఉండదు.. ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ఇంకోసారి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి చూసినా పార్టీ కార్యకర్తలు ఊరుకోరని స్పష్టం చేశారు. రౌడీ మూకలను వేసుకొని పార్టీ కార్యాలయాలపై దాడి చేసే దరిద్రపు సంస్కృతి కాదని.. మాటలతో, విజ్ఞతతో, నిబద్ధతతో ప్రజల కోసం పోరాటం చేసే సంస్కృతి బీఆర్ఎస్‌దన్నారు.

**మూసి మురికిమయం కావడానికి కారకులు ఎవరు?**

మూసి మురికిమయం కావడానికి కారకులు ఎవరో ప్రజలు గుర్తించాలని సూచించారు. పారిశ్రామిక వ్యర్థాలు మూసిలో కలుస్తుంటే 60 ఏళ్లు రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్ ఏం చేసింది? అని నిలదీశారు. మూసి నదిని ప్రక్షాళించడానికి కేసీఆర్ సంకల్పించారన్నారు. అందులో భాగంగానే ఎస్టీపీలను ఏర్పాటు చేయడమే కాకుండా.. గోదావరి నదితో అనుసంధానం చేయాలనుకున్నారన్నారు. మూసిలో మురుగునీటి శుద్ధి కోసం 31 ఎస్టీపీలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మూసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారన్నారు. మూసిని కాంగ్రెస్ నాయకులు ఏటీఎంగా మార్చాలని చూస్తున్నారన్నారు. హైదరాబాదుకు దగ్గరలో ఉన్న కొండపోచమ్మ సాగర్‌ను వదిలేసి దూరంగా ఉన్న మల్లన్న సాగర్ నుంచి మూసి %-% గోదావరి అనుసంధానం చేస్తామని ప్రభుత్వం అనడం సరికాదన్నారు.

**వేలకోట్ల ప్రజాధనం వృథా**

రూ.7500 కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందన్నారు. కొండపోచమ్మ నుంచి మూసి అన్నసంధానం చేసే ఆస్కారం ఉన్నప్పుడు ఈ కొత్త ప్రాజెక్టు ఎందుకు? అంటూ ప్రశ్నించారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మూసి ప్రక్షాళన పేరిట పేద ప్రజల ఇళ్లను కూల్చివేత కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందన్నారు. పేద ప్రజల ఇళ్లపైకి బుల్డోజర్లను పంపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం .. మూసి ప్రక్షాళనకు అయ్యే వ్యయం రూ.50 వేల కోట్లు అని ఒకసారి, రూ.లక్ష కోట్లు అని మరొకసారి, లక్షన్నర కోట్లు అని ఇంకోసారి సీఎం చెబుతున్నారన్నారు.

**డబ్బులు ఢిల్లీకి పంపే ప్రణాళిక..**

మూసిని ఏటీఎంగా మార్చుకొని.. వచ్చే డబ్బును ఢిల్లీకి పంపించే ప్రణాళిక సీఎం వేసుకున్నారని విమర్శించారు. యాదాద్రిలో కేసీఆర్ మొదలుపెట్టిన పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. యాదాద్రి వైభవాన్ని ప్రభుత్వం కాపాడాలని సూచించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధికి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ భూతాన్ని పారద్రోలేందుకు కేసీఆర్ సంకల్పించారన్నారు. అందులో భాగంగానే మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికి తాగునీరు సరఫరా చేశారన్నారు. ఫ్లోరైడ్‌ని నిర్మూలించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. అనేక సంవత్సరాలు రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ ఏనాడు ఒక వాటర్ ప్లాంట్ పెట్టిన పాపాన పోలేదని విమర్శించారు.

## జన్మతః పౌరసత్వం రద్దుపై ..ఆందోళన



వాషింగ్టన్: జన్మతః వచ్చే పౌరసత్వాన్ని రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆదేశాలు జారీ చేశారు. దీని వల్ల అక్రమ వలసదారులతో పాటు విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌కు ఆటంకాలు ఎదురుకానున్నాయి. వలసదారులకు పుట్టే పిల్లలకు జన్మతః పౌరసత్వం రాదు అని ట్రంప్ తాజా ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆ ఆదేశాలను భారతీయ సంతతి రాజకీయవేత్తలు తప్పుపట్టారు. అమెరికా చట్టసభప్రతినిధి రో ఖన్నా మాట్లాడుతూ.. బర్త్‌రైట్ సిటిజన్‌షిప్ రద్దు వల్ల హెచ్1బీ వీసాలపై ఉంటున్న వారి పిల్లలకు కూడా ప్రభావం పడుతుందన్నారు. హెచ్1బీ వీసాలపై అమెరికాలో పనిచేసే భారత్, చైనీయులు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. అయితే చట్టపరంగా వలసవచ్చినవారితో పాటు తాత్కాలికంగా స్టూడెంట్ వీసాలపై ఉన్న వారికి కూడా బర్త్‌రైట్ సిటిషన్‌షిప్ రద్దుతో ఇబ్బందులు ఎదురవుతాయని రో ఖన్నా తెలిపారు. ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు ఎలా ఉన్నా.. జన్మతః పౌరసత్వం హక్కు కోసం పోరాటం చేస్తానని, ఎన్ని అవరోధాలు ఎదురైనా, ఆ చట్టం కోసం ఫైట్ చేస్తానని మరో భారత సంతతి ప్రతినిధి శ్రీ థానేధార్ తెలిపారు. జన్మతః పౌరసత్వంపై ట్రంప్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగ వ్యతిరేకమని ప్రమీలా జయపాల్ తెలిపారు. ఇది రాజ్యాంగ వ్యతిరేకం అని, కేవలం ఓ పెన్ను సంతకంతో దాన్ని రద్దు చేయలేమని, ఒకవేళ ఆ చట్టాన్ని ఆమోదిస్తే, అప్పుడు రాజ్యాంగాన్ని అవమానించినట్లు అవుతుందన్నారు. ఇమ్మిగ్రేషన్ రైట్స్ గ్రూపులు.. ట్రంప్ ఆదేశాలకు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేసినట్లు ప్రమీలా తెలిపారు.జన్మతః పౌరసత్వ రద్దు ఆదేశాల ప్రకారం.. ఒకవేళ పేరెంట్స్ అమెరికా పౌరులు లేదా పర్మనెంట్ రెసిడెంట్ కాకుంటే, అప్పుడు 2025, ఫిబ్రవరి 19వ తేదీ తర్వాత పుట్టే పిల్లలకు ఆటోమెటిక్‌గా పౌరసత్వాన్ని ఇవ్వబోమని పేర్కొన్నారు. ట్రంప్ ఆదేశాలను సవాల్ చేస్తూ 22 రాష్ట్రాల్లో అటార్నీ జనరల్స్ కేసులు దాఖలు చేశారు. 14వ సవరణ ప్రకారం అమెరికాలో జన్మించే పిల్లలకు ఆటోమెటిక్‌గా పౌరసత్వం వస్తుంది. అయితే 18 రాష్ట్రాలు, రెండు నగరాలు ఆ సవరణను ప్రస్తావిస్తూ కోర్టులో కేసు వేశాయి.

### ట్రంప్ ఈవెంట్‌లో స్పెషల్ అట్రాక్షన్‌గా నీతా..

## కట్టూ బొట్టుతో ఆకట్టుకున్న మిసెస్ అంబానీ



రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ.. ఆసియాలోనే అత్యంత ధనవంతుడు. ఆ సంపన్నుడి సతీమణి నీతా అంబానీ ఆ రేంజ్‌కు తగ్గట్లే ఉంటుంది. ఎక్కడా ఆమె వైభవం తగ్గదు. రిచ్‌నెస్‌కు కేరాఫ్ అడ్రెస్ ఆమె. ఈవెంట్లకు తగ్గట్టు కట్టూబొట్టుతో ఆకట్టుకుంటుంటుంది. బాలీవుడ్ సినీ సెలబ్రిటీలకు తీసిపోని రీతిలో ఫ్యాషన్‌ను ప్రదర్శిస్తుంటారు. పూజా, వివాహాది కార్యక్రమాలకు సంప్రదాయ చీరకట్టులో దర్శనమిచ్చే నీతా.. బిజినెస్ ఈవెంట్లలో అందుకు తగ్గట్టు దుస్తులను ధరిస్తుంటారు. ఇంకా చెప్పాలంటే ఎక్కువశాతం నీతా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలా తనకు ఎంతో ఇష్టమైన చీర కట్టునే ఎంచుకుంటారు.%తాజాగా మొన్న జరిగిన అమెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో కూడా నీతా భారతీయ సంప్రదాయమైన చీరకట్టునే ఎంచుకుని మరోసారి తన ఫ్యాషన్ సెన్స్‌ను ప్రదర్శించారు. ట్రంప్ ఇనాగరేషన్‌కు ముందు జరిగిన ప్రైవేట్ రిసెప్షన్‌లో కాంచీపురం సిల్క్ శారీ ధరించి ఆకట్టుకున్నారు. పింక్, గ్రీన్ బోర్డర్‌తో కూడిన నలుపు రంగు పట్టుచీరలో మెరిసిపోయారు. ఈ చీరను తమిళనాడులోని దేవాలయాల శిల్ప కళను ప్రతిబింబించేలా తీర్చిదిద్దారు. ఈ శారీకి ప్రముఖ డిజైనర్ మనీశ్ మల్హోత్ర డిజైన్ చేసిన మోడ్రన్ బ్లౌజ్‌ను ధరించారు. ఇక చీరతోపాటు ఆమె ధరించిన పచ్చల హారం మరింత ఆకర్షణీయంగా కనిపించింది. ఈ నగలకు సుమారు 200 ఏళ్ల నాటి చరిత్ర ఉందట. ప్యారెట్ షేప్‌లో ఉన్న పెండెంట్‌ను ఈ హారానికి జత చేశారు.

## పుష్ప 2 డైరెక్టర్ సుకుమార్ ఇంట్లో ఐటీ దాడులు



హైదరాబాద్‌లో రెండో రోజూ ఐటీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు నివాసాలు, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ ఆఫీసుతోపాటు మైత్రీ మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారని తెలిసిందే. తాజాగా పుష్ప 2 డైరెక్టర్ సుకుమార్ ఇంటితోపాటు ఆఫీసులో కూడా తనిఖీలు చేపట్టారు. %పుష్ప 2 సినిమాకు సుకుమార్ తీసుకున్న రెమ్యునరేషన్, ఆదాయ వనరులు తదితర డాక్యుమెంట్లను పరిశీలించారు. పుష్ప 2కు సుకుమార్ తీసుకున్న రెమ్యునరేషన్.. ఇందుకు సంబంధించిన ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపులపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. ఐటీ అధికారులు ఇప్పటికే మంగళవారం ఉదయం నుంచే హైదరాబాద్‌లోని 8 చోట్ల ఏకకాలంలో 55 బృందాలు దాడులు చేపట్టారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి.

**పెట్టుబడులు, ఆదాయాలపై ఆరా..**

ఐటీ అధికారులు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ , మైత్రీ మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థలు ఆయా సినిమాలకు పెట్టిన పెట్టుబడులు, ఆదాయాలపై ఆరాతీసినట్టు తెలుస్తోంది. ఇప్పటికే సినిమాలకు పెట్టుబడులు.. వచ్చిన ఆదాయం ఇతర విషయాలపై దిల్ రాజును ప్రశ్నించగా.. తాను విజయ్‌తో తెరకెక్కించిన వారిసు (వారసుడు) సినిమా రూ.120 కోట్లు మాత్రమే వసూళు చేసిందని దిల్ రాజు ఐటీ అధికారులకు చెప్పినట్టు తెలుస్తోంది.అంతేకాదు విజయ్‌కు రూ.40 కోట్లు రెమ్యునరేషన్ ఇచ్చాం. ఈ సినిమాకు వచ్చిన నష్టాలను పూడ్చేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు రూ.60 కోట్ల నష్టపరిహారం చెల్లించామని చెప్పినట్టు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే.

## ట్రంప్ నిర్ణయంతో అప్రమత్తమైన భారత్..



అగ్రరాజ్యం అమెరికా 47వ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా యూఎస్‌లో నివసిస్తున్న వివిధ దేశాలకు చెందిన అక్రమ వలసదారులపై కఠిన వైఖరిని అవలంభిస్తున్నారు. ఆయా దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న వస్తువులపై అధిక పన్ను విధిస్తున్నారు. తద్వారా వలసలను తగ్గించొచ్చని అధ్యక్షుడు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో ట్రంప్ చర్యలతో భారత్ ఆచుతూచి నిర్ణయాలు తీసుకుంటోంది. అగ్రరాజ్యంతో సుదీర్ఘకాలంగా కొనసాగుతూ వస్తోన్న దౌత్య, ఆర్థిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారించింది. వాటిపై ఎలాంటి దుష్ప్రభావం పడకుండా జాగ్రత్త పడుతోంది. ట్రంప్ పాలనకు సహకరించేలా నిర్ణయాలు తీసుకుంటోంది.

ఇందులో భాగంగానే అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న తమ పౌరులను స్వదేశానికి రప్పించేందుకు భారత్ యోచిస్తున్నట్లు సమాచారం.సరైన పత్రాలు లేకుండా దాదాపు 18,000 మంది భారతీయులు అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. అయితే, వాస్తవానికి ఆ సంఖ్య మరింత ఎక్కువ కూడా ఉండొచ్చని అంచనా. తాజాగా కొత్త అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల నేపథ్యంలో వాళ్లందరినీ వెనక్కి పిలిపించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. దీనికోసం ఓ సమగ్ర ప్రణాళికను రూపొందించబోతోందని పేర్కొన్నారు.కాగా, ఎన్నికల ప్రచారంలో అక్రమ వలసదారులపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అక్రమ వలసదారులను ర్యాడికల్స్, టెర్రరిస్టులుగా అభివర్ణించారు. అలాంటి వాళు అమెరికా గడ్డపై నివసించేందుకు ఏమాత్రం అర్హులు కాదని వ్యాఖ్యానించారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే వలసలపై ఉక్కుపాదం మోపుతానని ప్రకటించారు. అందుకు అనుగుణంగానే బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఆచరణలో పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే జన్మతః పౌరసత్వ హక్కును కూడా రద్దు చేశారు.అమెరికా పౌరులకు పుట్టిన వారికే కాకుండా.. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా అమెరికా పౌరసత్వం లభిస్తుంది. 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అప్పటి నుంచి ఈ జన్మతః పౌరసత్వ విధానం కొనసాగుతున్నది. అయితే, దీన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. 'అక్రమ వలసదారులకు, తాత్కాలిక వీసాపై అమెరికాకు వచ్చిన వారికి పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించబోదు' అని ట్రంప్ ప్రకటించారు.ఈ నిర్ణయంతో లక్షలాది మంది భారతీయులపై తీవ్ర ప్రభావం చూపించనున్నట్టు నిపుణులు చెప్తున్నారు. ఇక ట్రంప్ చర్యల నేపథ్యంలో అప్రమత్తమైన భారత ప్రభుత్వం భారతీయులను తిరిగి వెనక్కి రప్పించడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది.

## వేద విద్యార్థుల కుటుంబాలను ఆదుకుంటాం : చంద్రబాబు



అమరావతి : కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలోమంత్రాలయం వేద పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతిని వ్యక్తపరిచారు. హంపీకి వెళ్తూ పొరుగు రాష్ట్రంలో ప్రమాదానికి గురైన వారికి అవసరమైన వైద్య సాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.%ఎంతో భవిష్యత్తు ఉన్న వేద విద్యార్థుల అకాల మరణంతో తీవ్ర శోకంలో ఉన్న వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వేద విద్యార్థులతో పాటు డ్రైవర్ కుటుంబాన్ని కూడా ఆదుకుంటామని ట్విటర్‌లో పేర్కొన్నారు. కర్ణాటక రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లా వాసుల మృతి పట్ల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కర్ణాటక జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బుధవారం వేకువ జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏపీకి చెందిన విద్యార్థులతో పాటు నలుగురు దుర్మరణం చెందారు. మృతులను మంత్రాలయం వేదపాఠశాలకు చెందిన వారిగా గుర్తించారు. విద్యార్థులు వాహనంలో కర్ణాటక హంపీ క్షేత్రంలోని నరహరి తీర్థుల ఆరాధన కోసం తుఫాను వాహనంలో బయలుదేరి వెళ్లారు.మంత్రాలయం నుంచి మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లగా.. ఉత్తరకన్న జిల్లాలో సింధనూరు వద్ద ప్రమాదానికి గురైంది. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో 14 మంది విద్యార్థులు ఉన్నారు. ఘటనలో వాహనం డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురు విద్యార్థులు అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో డ్రైవర్ శివ, విద్యార్థులు అభిలాష, హైవదన, సుజేంద్ర, ఉన్నారు.

## విజయ్ వారిసు కలెక్షన్లు రూ.120 కోట్లే.. ఐటీ అధికారులతో దిల్ రాజు.. ?



ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు నివాసాలు, వేంకటేశ్వర క్రియేషన్స్ ఆఫీసుతోపాటు మైత్రీ మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థల్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారని తెలిసిందే. హైదరాబాద్‌లోని 8 చోట్ల ఏకకాలంలో 55 బృందాలు దాడులు చేపట్టాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్, గచ్చిబౌలి సహా పలు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి.%రెండో రోజూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. సినిమాలకు పెట్టుబడలు.. వచ్చిన ఆదాయం ఇతర విషయాలపై దిల్ రాజును ప్రశ్నించగా.. తాను విజయ్‌తో తెరకెక్కించిన వారిసు (వారసుడు) సినిమా రూ.120 కోట్లు మాత్రమే వసూళ్లు చేసిందని దిల్ రాజు ఐటీ అధికారులకు చెప్పినట్టు తెలుస్తోంది. అంతేకాదు విజయ్‌కు రూ.40 కోట్లు రెమ్యునరేషన్ ఇచ్చాం. ఈ సినిమాకు వచ్చిన నష్టాలను పూడ్చేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు రూ.60 కోట్ల నష్టపరిహారం చెల్లించామని చెప్పినట్టు ఇన్‌సైడ్ టాక్.

**బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించాం..**

సోదాల్లో భాగంగా ఇప్పటికే ఐటీ అధికారులు దిల్ రాజు భార్య తేజస్వినిని బ్యాంక్‌కు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో తేజస్విని మీడియాతో మాట్లాడుతూ.. బ్యాంకు వివరాలు కావాలని అధికారులు అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించామని చెప్పారు.

దిల్ రాజు నివాసాలతోపాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి ఇండ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. దిల్ రాజు వ్యాపార భాగస్వాముల నివాసాల్లో ఇప్పటికే ఐటీ సోదాలు చేపట్టారని తెలిసిందే.

## సంపాదకీయం

**గురువారం 23-01-2025**

# అస్థిరతకూ అశాంతికి అసలు కారణమెవరు?

మాటిమాటికీ ఎన్నికలతో అభివృద్ధికి ఆటంకం అనీ అస్థిరత్వం అనీ ప్రధాని మోడీ, ఆయన వత్తాసుదారులు అదే పనిగా చెబుతున్నారు. పార్లమెంటులో నిబంధనలకు విరుద్ధంగా జమిలి బిల్లు ప్రవేశ పెట్టి బలం లేదని తెలుసు గనక వాయిదా వేసుకున్నారు. ఇందుకు సంబంధించిన భిన్న వాదోపవాదాలు ఒకటైతే అసలు ఈ హడావుడి చేసిన బిజెపి వారి గతం ఎట్టిదనే ప్రశ్న చాలా ఆసక్తి కలిగిస్తుంది. గత ముప్పై ఏళ్లలో అత్యధికంగా అస్థిరత్వంతో, అశాంతితో ఆటంకాలు కలిగించిన వారు ఎవరంటే వేలు బిజెపి వైపే చూపిస్తుంది. ఉంటే తాముండాలి. లేకుంటే మరొకరిని ఉండనివ్వకూడదనేది వారి రాజకీయ తాత్వికత. ఇక అధికారం కోసం మతతత్వం ప్రకోపింపచేయడం వారి సైద్ధాంతిక తాత్వికత. ఇందుకు ఉదాహరణలు లెక్కలేనన్ని. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు 1959లో కేరళ నంబూద్రిపాద్ ప్రభుత్వంతో మొదలెట్టి ఇష్టం లేని సర్కార్లను వరుసగా కూలదోసిన మాట నిజమే. కానీ ఈ విషయంలో బిజెపి రికార్డు మరో విధంగా హానికరమైందని గుర్తించవలసి వుంది.

స్వార్థం కోసం చిచ్చు

కాంగ్రెస్‌ను ఎదుర్కోవడమే తమ లక్ష్యమైనట్టు మాట్లాడే బిజెపి దాని పూర్వ రూపమైన జనసంఘం తాము లేని చోట్ల మరెవరూ వుండకూడదనే వైఖరినే అనుసరించాయి. ప్రతిపక్ష సంఘటన ప్రభుత్వాలు ఏర్పడిన చోట్ల కూడా తగవులతో మత కలహాలతో చిచ్చు పెట్టి పడగొట్టారు. 1967లో మొదటిసారి వివిధ రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడగా బెంగాల్‌లోనూ కేరళలోనూ సిపిఎం నాయకత్వం వున్న చోట్ల తప్ప మిగిలిన చోట్ల ఇలాంటి సర్కార్లు ఏర్పడ్డాయి. అవేవీ పూర్తికాలం నిలిచింది లేదు. జనసంఘం నాయకులు రకరకాల పేచీలతో అస్థిరత్వం పాలు చేశారు. ఇక వామపక్ష సర్కార్లను కేంద్ర కాంగ్రెస్ రద్దు చేస్తూ వచ్చింది. ఈ నేపథ్యం చివరకు 1975లో ఇందిరా గాంధీ ఎమర్జన్సీ విధింపుతో పరాకాష్టకు చేరింది. దానికి తక్షణ ప్రత్యామ్నాయంగా జనతా పార్టీ ఏర్పడి అధికారంలోకి వచ్చింది. జనతా పార్టీలో జనసంఘం వున్నా ప్రజాస్వామ్య పరిరక్షణ కోణంలో సిపిఎం కూడా మద్దతునిచ్చింది. అయితే పూర్తి మెజార్టీతో జనతా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆరెస్సెస్ తరహా మత రాజకీయాలను పాఠ్య పుస్తకాలలో జొప్పించడమనే ఎజెండాతో వివాదం ప్రారంభమైంది. ఈ క్రమంలో చివరకు ఆరెస్సెస్ ద్వంద్వ సభ్యత్వం వదులుకోవడానికి వాజ్‌పేయి, అద్వానీల నాయకత్వంలో జనసంఘ్ వర్గం నిరాకరించడం వల్ల ఆ ప్రభుత్వం పడిపోయే స్థితి వచ్చింది. ఆ సమయంలో చరణ్‌సింగ్‌ను బలపర్చి జనతా పార్టీ చీలికకు కారకులైనారు. రాష్ట్రాలలోనైతే అన్ని చోట్లా ఈ ఇద్దరి తరపు నాయకులే చీలికలు తెచ్చి సగం సగం చొప్పున ముఖ్యమంత్రి పదవులు చేజిక్కించుకున్నారు. తర్వాత జనసంఘం వర్గం ఆయననూ వెన్నుపోటు పొడిచింది.

ఎన్టీఆర్, చంద్రబాబు తేడా

1980లో ఇందిరా గాంధీ తిరిగి అధికారంలోకి రాగలిగారు. వచ్చీ రాగానే ఆమె రాష్ట్రాలలో జనతా ప్రభుత్వాలను రద్దు చేసి ఎన్నికలకు వెళ్లి విజయం సాధించారు. 80వ దశకం పొడుగునా బిజెపి లేకుండా కాంగ్రెస్ వ్యతిరేక కూటమి ఏర్పడాలన్నదే వామపక్షాల విధానంగా వుండేది. టిడిపి వ్యవస్థాపకుడు, ఏ.పి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వంటి వారు అందరూ కలసి వుండా లన్నా వామపక్షాలు విడిగానే వుంటూ వచ్చాయి. 1986లో రాజీవ్ గాంధీపై వి.పి సింగ్ తిరుగుబాటు తర్వాత మరోసారి జనతా తరహా ప్రయోగం జరగకుండా అడ్డుకోగలిగాయి. నేషనల్ ఫ్రంట్‌లోనూ బిజెపికి చోటు లభించలేదు. కాంగ్రెస్ ఓటమితో వి.పి సింగ్ ప్రభుత్వం ఏర్పాటు చేసినపుడు తమకు స్థానం లభించకపోవడం బిజెపికి మింగుడు పడలేదు. ఆయన మండల్ నివేదికను ఆమోదించడం అసలే నచ్చలేదు. దాంతో మండల్‌కు వ్యతిరేకంగా కమండల్ అంటూ అద్వానీ రథయాత్ర ప్రారంభించారు. ఆ అంశంపైనే ఆ ప్రభుత్వాన్ని పడగొట్టారు కూడా. వి.పి సింగ్ తర్వాత కాలంలో వాజ్‌పేయి ఏ మాత్రం బలం లేకున్నా సర్కారు ఏర్పాటు సంకేతాలిచ్చారు. తలుపులు తెరుచుకుని కూర్చున్నామన్నారు. కానీ ఎవరూ కలవలేదు. అలా రెండోసారి కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని వారే అస్థిరత్వం పాలు చేశారు. పి.వి నరసింహారావు హయాంలో దాగుడు మూతలాడుతూ బాబ్రీ మసీదును కూలదోసి ప్రపంచ వ్యాపితంగా నిరసనకు కారణమైనారు. ఆ సమయంలో వారి ఆధ్వర్యంలోని నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయడం అనివార్యమైంది. మసీదు కూల్చివేత ఘటనల తర్వాత ఎన్టీఆర్ 1994లో బిజెపితో పొత్తుకు నిరాకరించారు. ఎన్టీఆర్‌పై తిరుగుబాటు చేసిన చంద్రబాబు నాయుడు నిలదొక్కుకునే వరకూ 1996 ఎన్నికల వరకూ వామపక్షాలతో లౌకిక పార్టీలతో వున్నారు. తర్వాత మాత్రం మారిపోయారు.

వాజ్‌పేయి ప్రహసనం

1996లో కాంగ్రెస్ బయటి నుంచి ఇచ్చే మద్దతుతో ఈ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయగల స్థితి వున్నాఅధికారం కోసం ఆరాటంలో వాజ్‌పేయి ఏ మాత్రం మెజార్టీ లేకుండా కేవలం 160 సీట్లతో 1996లో సర్కారు ఏర్పాటు చేసి 13 రోజులలో అవమానకరంగా దిగిపోయారు. తర్వాత ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని సహించలేక రెండేళ్లలోనే కాంగ్రెస్‌తో కలసి కూలదోశారు. 1998లో వచ్చిన వాజ్‌పేయి ప్రభుత్వం చంద్రబాబు మద్దతు వల్ల 13 నెలలు నడిచినా బలం లేక కూలిపోయింది. ఇంత రాజకీయ అస్థిరత్వం, అశాంతి ఎవరిది మరి? కానీ ఆ కాలంలోనూ రాజ్యాంగాన్ని తిరగదోడేందుకు జస్టిస్ వెంకట్రామయ్య కమిషన్ వేసి విఫలయత్నం చేశారు. అధ్యక్ష తరహా పాలన మెరుగైందని అద్వానీ బాహాటంగా మాట్లాడారు. కార్గిల్ నేపథ్యంలో వాజ్‌పేయి 1999లో మూడోసారి కాస్త స్పష్టమైన ఆధిక్యతతో వచ్చినా ఆ కాలంలోనే గుజరాత్ మారణకాండతో సహా అనేక దారుణాలు జరిగాయి. తెహల్కా టేపుల వంటివి వచ్చాయి. తాముగా ఏడాది ముందే ఎన్నికలకు వెళ్లి భంగపడ్డారు. ఈ అస్థిరత్వమంతా ఎవరి పుణ్యం?

ముందస్తు నేత మోడీ

ఇక ఇప్పుడు జమిలి సామ్రాట్ నరేంద్ర మోడీ కార్యభూమి గుజరాత్ కథ చూద్దాం. వాజ్‌పేయి హయాంలోనే అక్కడ 1995లో కేశూభారు పటేల్ ముఖ్యమంత్రి కాగా మోడీ ఆరెస్సెస్ తరపున ప్రతినిధి. కేశూభారుతో శంకర్ సింగ్ వాఘేలా విబేధించడంతో ఆ ప్రభుత్వం ప్రతిష్టంభనలో పడిన పరిస్థితిని తాను ఉపయోగించుకున్నారు. మధ్యలో రాజీ అభ్యర్థిగా సురేష్ మెహతాను సి.ఎం ను చేసినా పెద్దగా నడిచింది లేదు. వాఘేలా స్వంతంగా పార్టీ ఏర్పాటు చేసి చీలిపోవడమే అందుకు కారణమైంది. 1998 ఎన్నికల నాటికి మళ్లీ కేశూభారు పటేల్‌ను తెచ్చినా నిలిచే పరిస్థితి లేకపోయింది. భూకంపం సహాయ కార్యక్రమాల్లో అవినీతికి పాల్పడ్డారనే కారణంతో 2001లో ఆయనను తప్పించి మోడీని సి.ఎం ను చేశారు. ఇదంతా ఏపాటి స్థిరత్వమో చూడొచ్చు. మోడీ హయాంలో గుజరాత్ మారణకాండ దేశాన్ని కుదిపేసింది. ప్రపంచం నివ్వెరపోయింది. ఆయనను దించేయాలని వాజ్‌పేయి ఆయనను చూసి చంద్రబాబు అన్నారు గానీ తర్వాత తగ్గారు. ఇదిగో అలాంటి భయానక సమయంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లారు

# ప్రభుత్వ పాలసీల్లో 'ప్రపంచబ్యాంకు'




అమరావతి : తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోంది. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ప్రకృతి వ్యవసాయం పేరుతో ఆహార ఉత్పత్తులను తగ్గించడం(శ్రీలంక గతపాలసీ) ఇవన్నీ కూడా దండలో దారంలా ఒకదానికొకటి పెనవేసుకుపోయి ఉన్నాయి.కొత్తగా తీసుకొచ్చే పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాలని ప్రతిపాదించారు. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ ఇందులో భాగమే. 2000 సంవత్సరంలో చంద్రబాబు తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని చూసింది. ఇప్పుడు ఇదే పద్ధతిని అమల్లోకి తీసుకువస్తున్నారు. ప్రభుత్వం ప్రైవేటు ఇండిస్టియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు.రాష్ట్రంలో వందకోట్ల పైబడి విలువైన కంపెనీలు ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2800కిపైగా ఉన్నాయి. ఒకవైపు కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ ప్రజలకు సహజ ఆదాయవనరుగా ఉన్న భూమిని మాత్రం ఎవరి చేతి నుండి వారే నేరుగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే విధంగా చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నారు. 2013 భూసేకరణ చట్టానికి రాష్ట్రంలో 2018లో సవరణలు తీసుకొచ్చారు. అంతకుముందే 2009లో ల్యాండ్ రిఫార్మ్స్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. ఇవి చాలదన్నట్లు ఇటీవల నెగోషియబుల్ పాలసీ తీసుకొచ్చారు. ఇంకొంచం ముందుకెళ్లి రీసెటిల్‌మెంట్ పాలసీని పరిచయం చేస్తున్నారు. ఈ మొత్తం పాలసీలన్నిటిలోనూ భూములను అడిగిన వారికి కోరుకున్నతంత కట్టబెట్టడమే ప్రధానంగా ఉంది.పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్లాంట్లను కూడా ప్రైవేటు భూముల్లోనే ఏర్పాటు చేసేందుకు మరో పాలసీ తీసుకొచ్చారు. దీనికి గ్రీన్ ఎనర్జీ అని పేరు పెట్టారు. పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తి పెరిగిందని, ఆదా చేస్తున్నామని చెబుతూనే బయట మార్కెట్ నుండి అదనపు ధరకు విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై ట్రూఅప్, ఎఫ్‌పిపిఎస్‌ఏ పేరుతో వేస్తున్నారు. గత 10 సంవత్సరాల కాలంలో విద్యుత్ ప్లాంట్లకు రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాలు కట్టబెట్టారు. వాటిని తీసుకున్న వారు మాత్రం తాకట్టు పెట్టి కోట్ల రూపాయలు రుణాలు తీసుకుంటున్నారు.ఇక నీటి అవసరాలు తీర్చే పేరుతో తొలిసారిగా జలవనరుల ప్రాజెక్టుల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించినట్లు వాటర్ పాలసీలో పేర్కొన్నారు. నీటి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పుడు విద్యుత్‌లాగే ఇక నీటికి కూడా వినియోగ ఖర్చు ప్రాతిపదికగా డబ్బు వసూలు చేస్తారు. చంద్రబాబునాయుడు తొలిసారి సంస్కరణలు అమలు చేసిన సమయంలో విద్యుత్‌తోపాటు నీటిని కూడా వినియోగ వస్తువుగా మార్చాలనేది కీలకాంశంగా పేర్కొన్నారు. 2008లోనే అన్ని పట్టణ ప్రాంతాల్లో మీటర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తీర్మానాలు చేయించారు. దాని ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో నీటి మీటర్లు బిగించారు. వీటి నిర్వహణ పేరుతో రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసి నీటి వ్యాపారాన్ని స్థిరీకరించనున్నారు. అంటే ప్రైవేటు వ్యక్తులు కట్టే ప్రాజెక్టులు రైతుల కోసమా వ్యాపారం కోసమా అనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు.ఫుడ్ ప్రాసెసింగ్ పేరుతో నీటిని తక్కువగా వినియోగించే హార్టికల్చర్ సాగును ప్రోత్సహించాలని మరో పాలసీని తీసుకొచ్చారు. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ షరతులు అమలు చేసిన శ్రీలంక, బంగ్లాదేశ్ ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనేది అందులో కీలక షరతు. అలాగే ఆహార ఉత్పత్తులు తగ్గించి ప్రాసెసింగ్‌కు అవసరమైన పంటలు పండించడం షరతుల్లో కీలకమైంది. ఇప్పుడు ఈ షరతునే పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. దీనివల్ల ఆహార ఉత్పత్తులు తగ్గి ఆహార సంక్షోభం ఏర్పడటం, అది ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించడం అర్జెంటైనాతోపాటు అనేక దేశాల్లో ఎదుర్కొన్న ప్రధాన సమస్య. 2017లో తీసుకొచ్చిన ఆధునిక యాంత్రీకరణ విధానం కూడా ప్రపంచబ్యాంకు షరతుల్లో భాగమే. చిన్న కమతాలను తగ్గించి కార్పొరేట్ వ్యవసాయం చేయడం కోసం ఈ షరతును బలవంతంగా రుద్దింది. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న ఈ పద్ధతి మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అదీ చిన్న కమతాలున్న చోట సాధ్యం కాదు. చిన్న కమతాలను తగ్గించడమంటే రైతులను, వాటిపై ఆధారపడి బతుకుతున్న వారికీ ఉపాధి లేకుండా చేసి బయటకు తరిమి వేయడమే !ఇంటికొక్కరు ఎంటర్‌ప్రెన్యూర్ కావాలని కొత్త పల్లవి. ఒకవైపు పెద్దపెద్ద కంపెనీలతో ఉపాధి వస్తుందని చెబుతూనే మరోవైపు ఎవరికివారే ఎంటర్‌ప్రెన్యూర్ అనడం అర్థం కాని విషయంగా మారింది. భవిష్యత్‌లో ఉద్యోగాలు ఎవరికివారే చూసుకోవాలనే విధంగా చెబుతున్నారు. 2006లో కేంద్రం ప్రపంచబ్యాంకు నిధులతో తీసుకొచ్చిన జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్(జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం) పథకం అప్పట్లో నిధులిచ్చే సమయంలో అర్బన్ రిఫార్మ్స్(పట్టణ సంస్కరణలు) తీసుకొచ్చింది. దీనిలో కీలకమైంది. ప్రతిపనికీ యూజర్‌ఛార్జీ వసూలు చేయడం, ప్రతిసేవకూ లెక్కగట్టి ఛార్జీలు వసూలు చేయడం. అందులో భాగంగానే యూజర్ ఛార్జీలు, ఆస్తివిలువ ఆధారిత పన్నులు, వీధిలైట్ల నిర్వహణ ప్రైవేటీకరణ, శానిటేషన్ ఖర్చులు వసూలు చేయడం, తాగునీటికి ఛార్జీలు, డిఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్సులు పెంచడం, కాలనీ అసోసియేషన్లు ఇవన్నీ కూడా సంస్కరణల్లో భాగమే వాటినే ఇప్పుడు కొత్తగా అమలుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం పూర్తిగా తన బాధ్యతల నుండి తప్పుకుని ప్రజలే పాలించుకుని, వారే పన్నులు విధించుకుని వారే నిర్వహించుకునే విధంగా షరతులు పెట్టింది. వాటిని ఇప్పుడు అన్ని పాలసీల్లో అమలు చేస్తున్నారు.మారిటైం పాలసీ పేరుతో సముద్రతీరం మొత్తం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే పోర్టులు, తీర ప్రాంత రోడ్లు అదానీ చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఇక మారిటైం పాలసీ అమలు చేస్తే రాష్ట్రానికి మిగిలేదేమీ లేకపోగా పోర్టులు తీసుకున్నవారి వస్తువుల రవాణా చేసేందుకు సదుపాయాలకు అవసరమైన రాయితీలు కల్పించేందుకు మాత్రమే ఆ పాలసీ ఉపయోగపడే విధంగా ఉంది. లాజిస్టిక్స్ పార్కులు కూడా వీటికి అనుబంధంగానే ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం చేసేదేమీ కనిపించకపోగా పాలసీల పేరుతో ప్రజల ముక్కుపిండి వసూలు చేయడం, ఉన్న వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టడం అనేది సుస్పష్టంగా కనిపిస్తోంది.

# వాట్సాప్ పాలనలో విశ్వసనీయత ఎంత?



రాష్ట్రంలో ఇకపై 153 రకాల పౌర సేవలను వాట్సాప్‌లో ఒక క్లిక్ ద్వారా పొందవచ్చని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గత నెల రోజులుగా ప్రకటనలు చేస్తున్న విషయం విదితమే.జనన, మరణ, కుల, ఆదాయం, స్థానికత, కరెంటు బిల్లుల చెల్లింపు, మున్సిపల్ పన్నులు, కొళాయి పన్ను తదితరాలతో పాటు భూ వ్యవహారాలకు సంబంధించి ఈసీ, అడంగల్ వంటి వాటికై ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా 153 రకాల పౌర సేవలు వాట్సాప్ ద్వారా పొందవచ్చని, సెల్‌ఫోన్ ఇప్పుడు చేతిలో ఆయుధమని చంద్రబాబు నాయుడు ప్రకటించారు.చంద్రబాబు చెబుతున్నట్టు 153 రకాల సేవలు ప్రభుత్వ కార్యా లయాలు, అధికారుల చుట్టూ తిరగకుండా ప్రజలకు తేలిగ్గా అందుబాటులోకి వస్తే మంచిదే. అయితే కొన్ని అంశాలను పరిశీ లించాల్సి వుంది.2024 అక్టోబర్ 22న న్యూఢిల్లీలో జరిగిన ఓ సమావేశంలో రాష్ట్ర మంత్రి నారా లోకేష్, సీనియర్ ఐఏఎస్ అధికారి, పరిశ్రమల శాఖా కార్యదర్శి యువరాజ్, ఆర్టీజిఎస్ సీఈవో దినేష్, మెటా కంపెనీ ఇండియా ఉపాధ్యక్షులు సంధ్యా దేవనాథన్, డైరెక్టర్ రవి గార్గే, పబ్లిక్ పాలసీ డైరెక్టర్ నటాషా లు ఒప్పందం చేసుకున్నారు. ఈ ఒప్పంద పత్రాలలో ఏముందో ఇప్పటివరకు బయటకు వెల్లడి కాలేదు. ఈ సేవలు రాష్ట్రానికి అందించినందుకు 'మెటా' సంస్థకు ప్రభుత్వం ఎంత మొత్తం చెల్లింపులు చేస్తున్నది? వినియోగదారుల డేటా గోప్యత, సైబర్ భద్రత వంటి విషయాలపై స్పష్టత రాలేదు.గతంలో కేంద్ర ప్రభుత్వ ఉదాసీనత కారణంగా ఆధార్ డేటాను కొన్ని ప్రైవేటు సంస్థలు అమ్మకానికి పెట్టిన విషయం విదితమే. 2018లో జరిగిన ఈ ఆధార్ డేటా లీకేజీ వ్యవహారం దేశాన్ని ఓ కుదుపు కుదిపింది.ఇప్పటికీ ఆన్‌లైన్ మోసాలు, ప్రజల గోప్యతకు సంబంధించిన అంశాలు పెద్ద ఎత్తున చర్చగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజల సమాచార గోప్యతకు సంబంధించిన వివరాలు కొత్త చిక్కుల్ని తెచ్చి పెడతాయా? అన్న ప్రశ్న టెక్నాలజీ నిపుణులను వేధిస్తున్నది.2018 నుంచి పెండింగ్‌లో ఉన్న డేటా ప్రైవసీ చట్టం అమలులోకి రాకముందే 'మెటా' లాంటి కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందాలు పౌరుల వ్యక్తిగత భద్రతకు ముప్పని ఇప్పటికే పలువురు చెబుతున్నారు. గతంలో 'మీ సేవ' పేరిట ఈ గవర్నెన్స్‌ను తీసుకొచ్చిన ప్రభుత్వం దాని ఫలితాలను అంచనా వేయకుండానే, మరో పేరు పెట్టి ఇలాంటి ఒప్పందాలు చేసుకోవడం సమంజసమా? అన్న ప్రశ్న వ్యక్తమవుతున్నది. ఈ తరహా ఒప్పందాలు కూటమి ప్రభుత్వంతో మొదలైనవి కావు.గతం లోను ఇలాంటి ఒప్పందాలు జరిగాయి. 2022 ఫిబ్రవరి 10వ తేదీన డిజిటల్ స్కిల్‌పై వాట్సాప్ ఇండియా నాటి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నది. రాష్ట్రం లోని యువతకు డిజిటల్ టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వటానికి, వాట్సాప్ ఇండియా ముందుకు వచ్చిందని, రాష్ట్రంలో 15 వేల మంది యువతకు పది రోజులు పాటు శిక్షణ ఇచ్చి వారిలో ఎంపికైన వారికి మైక్రోసాఫ్ట్ కంపెనీ ద్వారా ఏడాది పాటు శిక్షణ ఇస్తామని వాట్సాప్ ఇండియా ఉద్యోగాల ఎంపిక సందర్భంగా సహకారం అందిస్తుందని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రకటన చేసింది. 40 సాఫ్ట్ సర్టిఫికేషన్ కోర్సులను 1.62 లక్షల మందికి అందించనున్నామని 31 కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నామని నాడు ప్రకటించారు. ఆ తరువాత ఆ పథకం ఏమైంది? 1.62 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చాయా? నేటి వరకు తెలియదు.ఆ తరువాత 2022 జూన్ 10న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను త్వరితగతిన ప్రజలకు చేరడానికి వాట్సాప్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు. వాట్సాప్ కంపెనీ, ఏపీ డిజిటల్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజలకు ఏ మేరకు ఉపయోగపడిందన్న సమాచారం లేదు. వైసీపీకి ఎన్నికల సందర్భంగా కంపెనీ బాగా దోహద పడిందన్నది జనవాక్యం.

# జగిత్యాల ప్రభుత్వ దవాఖానాలో అమానవీయ సంఘటన

జగిత్యాల, జగిత్యాల జిల్లా ప్రభుత్వ దవాఖానాలో అమానవీయ సంఘటన చోటు చేసుకుంది. ప్రాణం పోయాల్సిన వైద్యులే పట్టనట్లుగా వ్యవహరించారు. బెడ్ పై నుంచి కిందపడి ఓ రోగి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నా.. ఎంతమందిని పిలిచినా ఎవరు స్పందించలేదు. గంటకు పైగా భూమయ్య బెడ్ కిందే పడిపోయి నరకయాతన అనుభవించాడు. నేను చచ్చిపోతున్న పట్టించుకోవాలని రోదించినా దవాఖాన సిబ్బందిలోని ఏ ఒక్కరి హృదయాన్ని కదిలించలేక పోయింది. ఆయన ఆర్తనాదం అరణ్య రోదనగానే మిగిలిపోయింది. కాగా, బీఆర్ఎస్ హయాంలో ఓ వెలుగు వెలిగిన ప్రభుత్వ దవాఖానులు నేడు పట్టించుకునే నాథుడే లేడని ప్రజలు చర్చించుకుంటున్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీ డిప్యూటీ సీఎంకు పటిష్ట భద్రత

రాజమండ్రి, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు పటిష్ట భద్రతను కల్పిస్తున్నామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ పవన్ భద్రతపై ప్రతీ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నామన్నారు. ఉపముఖ్యమంత్రి ఇంటిపై డ్రోన్ ఎగురవేయడంపై విచారణ చేస్తామని.. పవన్ ఇంటిపై డ్రోన్ ఎగిరిందా? లేదా? అన్నది నిర్ధారిస్తామని చెప్పారు. ఇక పవన్ కళ్యాణ్ ఏజెన్సీ పర్యటనలో భద్రతాపరంగా ఎలాంటి లోపం లేదని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్ పర్యటన తర్వాత వచ్చిన వ్యక్తి ఎవరనే విషయంపైనా విచారణ జరుగుతుందని డీజీపీ ద్వారకా తిరుమల రావు వెల్లడించారు. సోమవారం ఉదయం రాజమండ్రిలో డీజీపీ పర్యటించారు. ఈ సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన డీజీపీ.. పవన్ భద్రత అంశాన్ని సీరియస్‌గా విచారణ చేస్తున్నట్లు తెలిపారు. పవన్ ఇంటిపై డ్రోన్ కెమెరా ఎగిరిన ఘటనపై పోలీస్ శాఖ సీరియస్‌గా దర్యాప్తు చేస్తోందని.. నిన్న సాయంత్రానికి విచారణ పూర్తి కావాల్సి ఉందన్నారు. డ్రోన్ ఎగరడంపై పోలీసులు ముఖ్యమైన సమాచారాన్ని సేకరించారని తెలిపారు. అయితే ఈరోజు కూడా విచారణ కోసం కొంత సమయం కావాలని పోలీసులు అడిగారని.. నేటి సాయంత్రానికి డ్రోన్ కెమెరా ఎగిరిన అంశానికి సంబంధించి మొత్తం విచారణ పూర్తి అవుతుందని డీజీపీ తెలిపారు. గతంలో డిప్యూటీ సీఎం పవన్.. పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించిన సమయంలో ఒక నకిలీ పోలీసు ప్రత్యక్షం కావడం తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై మీడియా ప్రస్తావించగా.. ఈ రెండు అంశాలను వేరువేరుగా చూస్తున్నామని తెలిపారు. మన్యం జిల్లాలో పవన్ పర్యటనలో ఎటువంటి భద్రతా లోపం లేదని, కేవలం పర్యటన పూర్తి అయిన తర్వాతే నకిలీ పోలీసు వచ్చినట్లు పోలీసులు గుర్తించారని.. దానిపై కూడా విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యంగా పవన్ ఇంటిపై డ్రోన్ కెమెరాను ఎవరు ఎగురవేశారు.. అసలు అది డ్రోన్ కెమెరానా కాదా అనేదానిపై ప్రాథమికంగా నిర్ధారణకు వస్తామని తెలిపారు. అసలు పవన్ ఇంటిపై డ్రోన్ కెమెరా ఎగురవేసే అవకాశం ఉందా? లేదా అనేది పోలీసుల విచారణలో తేలుతుందని డీజీపీ ద్వారకా తిరుమల రావు పేర్కొన్నారు.

# లైన్ క్లియరైందా?

అమరావతి,తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపీ మంత్రి నారా లోకేశ్ డిప్యూటీ సీఎంగా ప్రమోట్ కాబోతున్నారా? టీడీపీ శ్రేణుల నుంచి రోజురోజుకు తీవ్రమవుతున్న ఈ డిమాండ్ పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించారా? కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం టీడీపీ కార్యకర్తల డిమాండ్ పై సానుకూలంగా ఉన్నారా? అంటే అవుననే సమాధానం ఏపీ రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. తెలుగుదేశం పార్టీకి మూడో తరం వారసుడిగా.. రాబోయే కాలంలో పార్టీని నడిపించే నాయకుడిగా లోకేశ్ ఇప్పటికే పూర్తి స్థాయిలో తన సమర్థతను చాటుకున్నారు. లోకేశ్ సారథ్యంలో టీడీపీకి బంగారు భవిష్యత్ ఉంటుందని ఆ పార్టీ క్యాడర్ బలంగా నమ్ముతోంది. దీనికి కారణం లోకేశ్ రాజకీయంగా ఎంతో పరిణితిని కనబర్చడమే. ప్రతి పక్షంలో ఉన్న సమయంలో జగన్ మోహన్ రెడ్డి అరాచక పాలనకు ఎదురెళ్లి లోకేశ్ సవాల్ చేశారు. యువగళం పాదయాత్రతో ప్రజల్లోకి వెళ్లి వైసీపీ అధిష్టానానికి ముచ్చెమటలు పట్టించారు. లోకేశ్ దూకుడు కారణంగానే జగన్ అరాచక పాలనకు భయపడి మూడేళ్లు బయటకురాని తెలుగుదేశం నేతలు, కార్యకర్తలతోపాటు పలు వర్గాల ప్రజలు సైతం ఒక్కసారిగా రోడ్లెక్కి అప్పటి ప్రభుత్వంపై పోరు బాట పట్టారు. దీంతో జగన్ పతనానికి బీజం పడినట్లయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా ప్రభుత్వంలో నారా లోకేశ్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. తన పరిధిలోఉన్న శాఖల్లో కీలక మార్పులు తీసుకువస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. తనదైన మార్క్ ను చూపిస్తున్నారు. అన్నివిధాలా లోకేశ్ తన సమర్థతను నిరూపించుకోవటంతో తెలుగుదేశం శ్రేణులు డిప్యూటీ సీఎంగా లోకేశ్ ను ప్రమోట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఆ పార్టీలోని కీలక నేతలు బహిరంగంగానే లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలంటూ చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం అధికార ప్రతినిధి మహాసేన రాజేశ్, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాస్ రెడ్డితోపాటు డిప్యూటీ స్పీకర్ గా ఉన్న రఘురామ కృష్ణరాజు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఇలా పలువురు నేతలు ఒక్కొక్కరుగా నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎంగా ప్రమోట్ చేయాలని కోరుతున్నారు. ఇటీవల మైదుకూరు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీనులైన సభావేదికపైనే శ్రీనివాస్ రెడ్డి లోకేశ్ ను డిప్యూటీ సీఎంను చేయాలంటూ చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఇది నా ఒక్కడి అభిప్రాయం కాదు, తెలుగుదేశం క్యాడర్ అభిప్రాయం అని చెప్పారు. అయితే, చంద్రబాబు శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తిపై స్పందించలేదు. కానీ, తెలుగుదేశం ముఖ్యనేతలతో మాట్లాడుతున్న సందర్భంలో సమయం వచ్చినప్పుడు కూటమి నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుందామని చంద్రబాబు చెప్పినట్లు పార్టీ నేతల్లో చర్చ జరుగుతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదుగురు ఉపముఖ్యమంత్రులు ఉండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఒక్కరే డిప్యూటీ సీఎంగా కొనసాగుతున్నారు. డిప్యూటీ సీఎం అనేది రాజ్యాంగబద్ధమైన పదవి కాదు.. అదో రాజకీయ పదవి అని చెప్పవచ్చు. ఎందుకంటే రాజ్యాంగంలో డిప్యూటీ సీఎం అనే పదవి గురించి ఎక్కడా ప్రస్తావన లేదు. అయితే, దాదాపు అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వాల్లో డిప్యూటీ సీఎంలు ఒకరు, అంతకంటే ఎక్కువ మంది ఉన్నారు. ఉపముఖ్యమంత్రి అంటే రాజ్యాంగబద్ధమైన పదవికాకపోయిన ఆ స్థానంలో ఉన్నవారు ముఖ్యమంత్రి తరువాత ముఖ్యమంత్రిగా రాజకీయ పార్టీలు, ప్రజలు భావిస్తారు. డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న వ్యక్తి తన శాఖలపై సమీక్షలు చేస్తూనే.. ఇతర శాఖలపై సమీక్షలు చేసే అవకాశం కూడా ఉంటుంది. మంత్రుల కంటే డిప్యూటీ సీఎంకు పవర్స్ ఎక్కువ అనే చెప్పొచ్చు. దీంతో కూటమిలో అతిపెద్ద పార్టీ అయిన తెలుగుదేశం నుంచి నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న డిమాండ్ గట్టిగా వస్తోంది. మంత్రిగా ఉండటం వల్ల కేవలం కొంతమేర మాత్రమే లోకేశ్ ప్రభుత్వంలో భాగస్వామ్యం కాగలుగుతున్నారనీ, ఉపముఖ్యమంత్రి హోదా ఉంటే పాలనపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, అభివృద్ధిని పరుగులు పెట్టించేందుకు అవకాశం ఉంటుందని అంటున్నారు. అంతే కాకుండా లోకేష్ కు ప్రమోషన్ తెలుగుదేశం బలోపేతానికి సైతం దోహదపడుతుందని పార్టీ నేతలు సైతం చెబుతున్నారు. మంత్రి నారా లోకేశ్ ను డిప్యూటీ సీఎంగా ప్రమోట్ చేయాలని తెలుగుదేశం నేతల నుంచి వ్యక్తమవుతున్న డిమాండ్ పట్ల జనసేన పార్టీ నేతలు మౌనంగానే ఉన్నారు. అయితే తెలుగుదేశం శ్రేణుల డిమాండ్ ను అవకాశంగా తీసుకొని కూటమిలో విబేధాలు తలెత్తేలా చేయాలని వైసీపీ సోషల్ మీడియా గట్టిగానే ప్రయత్నిస్తున్నది. జనసేన పార్టీ కార్యకర్తలమంటూ టీడీపీకి వ్యతిరేకంగా పోస్టులు పెడుతుండటం విశేషం. అయితే, లోకేశ్ ను డిప్యూటీ సీఎంగా ప్రమోట్ చేయాలన్న డిమాండ్ పై జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ

# మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్థుల పోరుబాట

నాగర్ కర్నూల్, నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారంలో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. 'మైనింగ్ వద్దు.. గుట్ట ముద్దు' అనే నినాదంతో రైతులు నేటి నుంచి రిలే నిరాహార దీక్షలకు సన్నద్ధమయ్యారు. దీంతో పోలీసులు ముందస్తుగా పలువురు రైతులు, స్థానికులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ గ్రామానికి చెందిన రైతులను అక్రమంగా అరెస్ట్ చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ? గ్రామస్తులు పెద్ద ఎత్తున మహిళలు, రైతులు రోడ్డుపైకి చేరి నిరసనకు దిగారు. అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. పురుగుల మందు డబ్బాతో రోడ్డుపై బైఠాయించి ఆందోళన ఉధృతం చేశారు. గ్రామంలోనికి పోలీసులను రానీయకుండా ముళ్లకంచెలు వేశారు. మైలారం గ్రామస్తులు చేపట్టిన ఈ ఆందోళనకు మద్దతు తెలపడానికి హైదరాబాద్ నుండి బయలుదేరి వచ్చిన పౌరహక్కుల నేతలు ప్రొఫెసర్ హరగోపాల్, గడ్డం లక్ష్మణ్ లను కూడా పోలీసులు వెల్దండ వద్ద అడ్డగించి అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. దీంతో మైలారం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. మైనింగ్ కు వ్యతిరేకంగా గ్రామస్తుల నిరసన కొనసాగుతోంది. అయితే రైతులు, గ్రామస్తులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. అక్రమ అరెస్టులు ఆపాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేసారు. గ్రామానికి పోలీసులు రాకుండా కంచె ఏర్పాటు చేశారు. మైలారం గ్రామంలో ఉండే గుట్టపై క్వార్ట్జ్ ఖనిజాలను మైనింగ్ చేసేందుకు అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో గత కొంత కాలంగా అక్కడ మైనింగ్ జరుగుతోంది. అనుమతుల నియమాలకు వ్యతిరేకంగా ఈ మైనింగ్ జరుగుతోందని పేర్కొంటూ గ్రామస్తులు గత కొద్ది రోజులుగా ఆందోళన చేపట్టారు. మైనింగ్‌పై ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదని, గ్రామ తీర్మానం కూడా ఫేక్‌గా సృష్టించి మైనింగ్ జరుపుతున్నారని గ్రామస్తులు ఆందోళన చేస్తున్నారు. ఈ ఆందోళన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించేందుకు ఇటీవల హైదరాబాద్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ప్రొఫెసర్ హరగోపాల్ కూడా సంఘీభావం తెలిపారు. దీంతో సోమవారం నుంచి రిలే నిరాహారదీక్షలు చేపట్టాలని గ్రామ సభ తీర్మానించింది. దీనికి హరగోపాల్‌ను ముఖ్య అతిథిగా పిలిచారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు సోమవారం తెల్లవారుజాము 4 గంటలకు గ్రామానికి వచ్చి నిరసనకారులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మహిళలు గ్రామంలో రోడ్డుకు అడ్డంగా కంచె వేసి పోలీసులు రావద్దంటూ మహిళలు పురుగుల మందు డబ్బాలు పట్టుకుని నిరసన చేపట్టారు. చాలా కాలంగా మైనింగ్‌కు వ్యతిరేకంగా గ్రామస్తులు పోరాటం చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మైలారం గ్రామంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. మైలారం మైనింగ్ వెలికితీత కార్యక్రమాన్ని నిలిపివేయాలని గత మూడు నెలలుగా ఆ గ్రామస్తులు శాంతియుత పోరాటం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు రిలే నిరాహార దీక్షలకు పూనుకున్నారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకొని మహిళలను, రైతులను అరెస్ట్ చేశారు. అలాగే అచ్చంపేటలో ఉన్న మైలారం గ్రామ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడిని కూడా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది.

# మిస్టరీ డెత్స్...

సెంట్రల్ డెస్క్:జమ్ము కశ్మీర్‌లోని రాజౌరీ ప్రాంతంలో 45 రోజుల వ్యవధిలో 16 మంది అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపుతోంది. జ్వరం, ఒళ్లు నొప్పులు, వికారం, స్పృహ కోల్పోవడం లాంటి సమస్యలతో బధాల్ గ్రామ ప్రజలు స్థానిక ఆస్పత్రుల్లో చేరుతున్నారు. కొద్ది రోజుల తర్వాత అక్కడే మరణిస్తున్నారు. దీంతో ఏదో అంతుచిక్కని వ్యాధి ప్రబలుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.అయితే.. చండీగఢ్‌లోని పీజీఐమర్ సంస్థ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవీ), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) వంటి వివిధ సంస్థలు ఇప్పటికే రంగంలోకి దిగినప్పటికీ మరణాలకు గల కారణం తెలియరాలేదు. ఇటీవల మరో మహిళ ఆస్పత్రిలో చేరడంతో జిల్లా వైద్యాధికార యంత్రాంగం అప్రమత్తమైంది.బాధిత కుటుంబాల నుంచి సమాచారాన్ని సేకరించేందుకు వైద్యాధికారులు పోలీసుల సహకారం తీసుకుంటున్నారు. అప్పటి నుంచి ఊర్లోనే..డాక్టర్లు ఆ గ్రామంలో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు.డిసెంబరు 7వ తేదీ నుంచి ఊరిలోనే ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి ముందు జాగ్రత్త చర్యలపై కౌన్సెలింగ్ ఇస్తున్నారు. మరో 8 నుంచి 10 రోజుల్లోగా అంతుచిక్కని మరణాలకు సంబంధించిన వివరాలు బయటికి వస్తాయని డాక్టర్లు తెలిపారు. శాంపిళ్లను సేకరించామని, మెడికల్ టెస్టులు జరుగుతున్నాయని చెప్పారు.

కారణాలపై అన్వేషణ..

మిస్టరీ మరణాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పందించారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి కారణాలు తెలుసుకునేందుకు తక్షణమే కేంద్ర బృందాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హోంశాఖకు చెందిన సీనియర్ అధికారి ఈ బృందానికి నేతృత్వం వహించనున్నారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ, వ్యవసాయశాఖ, ఎరువులు, రసాయనాల శాఖ, జలవనరుల శాఖకు చెందిన నిపుణులు ఈ బృందంలో సభ్యులుగా ఉంటారు. వీరికి పశు పోషణ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు సహకరిస్తారు.

అధ్యయనం కోసం బృందం..

బాధితులకు తక్షణ సాయం అందించి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న దానిపై కసరత్తు చేస్తున్నట్టు హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ తరహా ఘటనలపై అధ్యయనం చేసేందుకు దేశంలోని అత్యంత ప్రముఖ సంస్థల నుంచి నిపుణులను కూడా కేంద్రం సిద్ధం చేసింది. స్థానిక అధికారులతో కలిసి ఆదివారం దర్యాప్తు ప్రారంభించింది. మొత్తానికి కశ్మీర్లో మిస్టరీ మరణాలపై మరింత అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం, అన్ని కోణాల్లో దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది.మెదడువాపుగా నిర్ధారించిన స్థానిక డాక్టర్లు..నెల రోజుల వ్యవధిలో 16 మంది అనుమానాస్పదంగా చనిపోవడం ఆ ప్రాంత ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. ఈ దిగ్భ్రాంతికర పరిస్థితులను సరిచేయడానికి ఆరోగ్య శాఖ నిపుణులు జమ్ముకశ్మీర్‌లోని రాజౌరి జిల్లా బుధాల్ గ్రామంలో పర్యటించారు.గ్రామంలోని మరణాలు న్యూరోటాక్సిన్‌ల వల్ల సంభవించాయని నిర్ధారణకు వచ్చారు. చనిపోయిన వారంతా మెదడు వాపు లేదా ఎడెమాతో బాధపడుతున్నారని డాక్టర్లు తెలిపారు. మృతుల్లో ఆ మూడు కుటుంబాల వారే..దేశంలోని ప్రధాన ప్రయోగశాలలు విశ్లేషించిన శాంపిల్స్‌లో లభించిన న్యూరోటాక్సిన్స్ మెదడు దెబ్బతినడానికి కారణమయ్యాయని డాక్టర్ భాటియా చెప్పారు.గ్రామం నుంచి సేకరించిన శాంపిల్స్ ఆధారంగా నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (NCDC), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, పూణే, ఇతర ప్రయోగశాలల్లో విశ్లేషించారు. పరీక్ష ఫలితాల్లో ఎలాంటి వైరస్ కానీ, బ్యాక్టీరియాతో మరణాలు సంభవించినట్టు లేదని డాక్టర్లు తెలిపారు. దీంతో అంటువ్యాధిగా కానీ ఉందేమో అనే సందేహాలు వచ్చాయని,

# కుంభమేళాకు మూలాలు ఎక్కడ?



లక్నో:ప్రతి పన్నెండేళ్లకు ఒకసారి మన భారత దేశంలో కుంభమేళా జరుగుతుంది. ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో గంగా మధ్యప్రదేశ్ ఉజ్జయినీలో సిప్రా మహారాష్ట్ర నాసిక్‌లో గోదావరి ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో గంగా, యమునల సంగమంలో కుంభమేళా జరుగుతుంది. ఈ నాలుగు ప్రదేశాల్లో లక్షల జనం అక్కడి నదుల్లో స్నానాలు చేస్తుంటారు. తమ పాపాలు కడిగివేయబడతాయనీ, తమకు స్వర్గద్వారాలు తెరుచుకుంటాయనీ, భవిష్యత్తులో తమకు, తమ కుటుంబానికీ అంతా మంచే జరుగుతుందనీ ఆశపడుతుంటారు. ఆశ పడడంలో తప్పు లేదు గాని మంచి జరుగుతుందన్న దానికి ఆధారాలు లేవు. కుంభమేళా శతాబ్దాలుగా కొనసాగుతున్నా ఆధారాలు మాత్రం ఇప్పటికీ కనిపించడం లేదు.అసలు ఈ కుంభమేళాకు మూలాలు ఎక్కడ? అది ఎలా ప్రారంభమైంది? కాలక్రమంలో మార్పులు చేర్పులతో, వక్రీకరణలతో అంధ విశ్వాసాలకు ఎలా ఆలవాలమైందీ? తెలుసుకోవాలంటే సాధారణ శకం ఏడవ శతాబ్దంలోకి వెళ్లాలి. ఆ కాలంలో ఉత్తర భారత దేశాన్ని ఏక రాజ్యాధికారంలోకి తెచ్చిన చక్రవర్తి హర్షుడి గూర్చి తెలుసుకోవాలి. ఆయన "దాన వీరుడు"గా ఎలా గుర్తింపు తెచ్చుకున్నాడో.. తెలుసుకోవాలి! చక్రవర్తి హర్షుడి పేరు మనకు కొత్తేమీ కాదు. చరిత్ర పాఠాల్లో చదువుకున్నదే !సాధారణ శకం 590 647 మధ్య జీవించినవాడు. 606 నుండి 647 వరకు పరిపాలించినవాడు. ఒకవైపు యుద్ధాలు చేస్తూ సామ్రాజ్యాన్ని విస్తరించడంలోను, ప్రజలను శాంతియుతంగా పరిపాలించడంలోనూ ఆయన తనకు తానే సాటి అని అనిపించుకున్నవాడు. కుంభమేళా ఈ బౌద్ధ చక్రవర్తి హర్షుడు రూపొందించుకున్న సంప్రదాయం.హర్షుడికి 'శిలాదిత్య' అనే బిరుదు ఉండేది. ఏడవ శతాబ్దంలో భారతదేశంలో పర్యటించిన చీనీ యాత్రికుడు హ్యూన్‌త్సాంగ్ రచనల్లో విషయాలు స్పష్టంగా ఉన్నాయి. ఆయన రచనకు తర్వాత కాలంలో హిందీ అనువాదం కూడా అందుబాటులో కొచ్చింది. అందువల్ల ఏమాత్రం అనుమానం లేకుండా, మనం ఈ విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. హర్షుడికి యుద్ధ వీరుడిగా ఎంత పేరుందో దాన వీరుడిగా అంతకన్నా ఎక్కువ పేరుంది. దయార్ద్ర హృదయుడు కాబట్టే, ప్రజలు ఆయనను కోరుకుని రాజును చేశారు. తమ ప్రియ బాంధవుడిగా భావించారు. ఆ రోజుల్లో ఆయన చేపట్టిన దానధర్మాలను ఇప్పుడు మనం చేస్తున్న కుంభమేళాకు కొంత సంబంధముంది. ఇప్పుడు మనం చూస్తున్నది వైదిక ధర్మప్రబోధకులు తయారు చేసిన మేళా! హర్షుడు ప్రారంభించినప్పుడు దాని ఉద్దేశం వేరు.హర్షుడి రాజధాని కనౌజ్ (ఉత్తరప్రదేశ్). ఆయన త్రివేణి సంగమానికి వెళ్లి, అక్కడి నుండి అందరికీ దానాలు చేసేవాడు. ఆయన ఇచ్చే దానాలు స్వీకరించాలని జనం దూరదూర ప్రాంతాల నుండి తరలివచ్చేవారు. ఆ ప్రదేశాన్ని 'మహాదానభూమి' అని అనేవారు. మొదటి రోజు ఆయన బుద్ధుడి విగ్రహాన్ని కడిగి వైభవోపేతంగా పూలతో అలంకరించేవాడు. తరువాత స్థానికంగా ఉన్న భిక్షులను, మేధావులను, పండితులను గౌరవించి వారికి కానుకలు ఇచ్చి సాగనంపేవాడు. నలంద, తక్షశిల విశ్వవిద్యాలయ అధ్యాపకుల్ని సత్కరించి కానుకలిచ్చేవాడు. ఆ తర్వాత ఇతర మతాలు పాటించేవారిని కూడా పిలిచి, మర్యాద పూర్వకంగా కానుకలు సమర్పించేవాడు. తరువాత వరుసలో విధవరాండ్రు, దుఃఖితులు, దరిద్రులు, రోగులు, అంగవైకల్యం ఉన్నవారు. ప్రార్థనా స్థలాల్లో పని చేసే మహంతులు, పాండాలు, పూజారుల వంటి వారికందరికీ వరుసగా దానాలు చేసేవాడు. తన చేతి వేళ్లకు ఉన్న ఉంగరాలు, మెడలోని రత్నాల హారాలు మొదలైన వాటిని కూడా దానం చేసేవాడు.ప్రజాధనం ప్రజలకు చేరిందంటే అంతకన్నా సార్థకత ఏముంది?" అని ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునేవాడు. ఇలాంటి విషయాలన్నీ హ్యూన్‌త్సాంగ్ నోట్స్ వల్ల తెలుస్తున్నాయి. హర్షచక్రవర్తి దానగుణం ఏ స్థాయిలో ఉండేదో తెలుసుకోవడానికి ప్రచారంలో ఉన్న ఒక కథను పరిశీలిద్దాం ఒకసారి ఆయన త్రివేణి సంగమం చేరుకుని మహాదాన భూమి నుండి దానాలు చేశాడు. వంటి మీద ఆభరణాలు, చేతి ఉంగరాలు పైన ఉన్న వస్త్రాలు అన్నీ దానం చేశాడు. మొలకు ధోవతి తప్ప ఏమీ మిగలలేదు. అప్పుడు ఒకడు వచ్చి 'రాజా' అని చేయి చాపాడు. అప్పుడు ఇక ఏం చేయాలో తోచక, హర్షుడు పక్కన ఉన్న మహిళను అభ్యర్థించి ఓ కండువా తీసుకున్నాడు. ఆ కండువా తను చుట్టుకుని తన విలువైన ధోవతిని ఆ చేయి చాపి నిలుచున్నవాడికి అందించాడు.ఒంటి మీద ఉన్న గుడ్డలతో సహా ఆయన ప్రజలకు దానం చేసే వాడని ఆ కథ చెపుతుంది. దాని ఆధారంగా వైదిక ప్రబోధకులు నగ్న సన్యాసుల్ని, నాగ బాబాల్ని, అఘోరాల్ని కుంభమేళాలో చేర్చారు. ఉన్నదంతా ప్రజలకు, సమాజానికి దానమివ్వాలని శిలాదిత్య హర్షచక్రవర్తి చెపితే, దాన్ని కుంభమేళాగా మార్చి నీటిలో మునిగితే చాలు సర్వపాపహరణ జరుగుతుందని ఊదరగొట్టారు. హర్షుడు ప్రారంభించిన ఆ సంప్రదాయం ఆయన తర్వాత కూడా కొంత కాలం కొనసాగింది. జమీందారులు, ధనవంతులు, కొందరు ఆ మహాదాన భూమికి వచ్చి, నదీ స్నానాలు చేసి తమ దగ్గరున్న ధనం, బంగారం దానం చేసి వెళ్లేవారు. కాలక్రమంలో దానాలు ఆగిపోయి ఉట్టి స్నానాలు మిగిలాయి.చక్రవర్తి శిలాదిత్య తన కోశాగారంలో ఉన్నదంతా సమాజానికి వివిధ వర్గాల వారికి దానం చేశాడే గానీ, నగ్నంగా ఊరేగలేదు. ఊరేగాలనీ చెప్పలేదు. నదీ స్నానాల వల్ల పుణ్యం వస్తుందని గానీ, పాపాలు పోతాయని గానీ, కోర్కెల తీరతాయని గానీ హర్షుడు తన ప్రజలకు చెప్పలేదు. బౌద్ధ స్థూపం కట్టించి, బౌద్ధ జీవన విధానానికి ప్రాముఖ్యమివ్వాలని చెప్పకనే చెప్పాడు. అదే సమయంలో ఇతర మతస్థుల్ని కూడా సమానంగా ఆదరించాడు. కుల, మత, లింగ, ప్రాంత భేదాలు ఉండకూడదని, అందరూ కలిసి మెలిసి ఉండాలని ఆయన భావించాడు. నదీ స్నానం పేరుతో అందరినీ ఒక్కచోట చేర్చి, ఒక్కటిగా చూడాలని అనుకున్నాడు. తన నుండి దానం స్వీకరించడానికి దూరప్రాంతాల నుండి వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించేవాడు. రాజు అంటే తండ్రి లాంటి వాడని ఆయనకు తెలుసు. అందుకే ప్రజలెవరూ ఆకలికి అలమటించకుండా ఆ మహా మానవ సమూహానికి అన్నం పెట్టే బాధ్యత హర్షుడే తీసుకునేవాడు. ఉన్నవన్నీ ఇతరుల కోసం త్యజించి, సమాజానికి మహోపకారం చేయడమన్నది బౌద్ధ చక్రవర్తి ఇచ్చిన సందేశం.

# విశాఖ ప్లాంట్‌కు ప్రైవేటీకరణ ముప్పు...




విశాఖపట్టణం, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రైవేటీకరణ ముప్పు తొలగలేదని, 11,440 వేల కోట్ల రూపాయల సహాయం అందిస్తున్నట్టు ప్రకటించి కేంద్రం ప్రభుత్వ నయ వంచనకు పాల్పడుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న పెర్కొన్నారు. విశాఖ ఉక్కుకు సహాయం పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు ప్రాణం పోస్తోందని అగ్రహారం వ్యక్తం చేశారు. నాలుగు నెలలుగా జీతాలు లేక ఉద్యోగులు విలవిల లాడుతున్నా ఒక్క మాట కూడా మాట్లాడని కూటమి నేతలు ఇప్పుడు కేంద్రం నుంచి ప్యాకేజీని తామే సాధించామని సంబరాలు జరుపుకుంటున్నారని తెలిపారు. పెద్ద ప్యాకేజీని అందిస్తున్నట్టు చెబుతున్న కేంద్రం ఈ సొమ్ము వినియోగానికి సవాలక్ష నిబంధనలు పెట్టిందన్నారు. ఈ మేరకు సోమవారం అయిన ఓ ప్రకటన విడుదల చేసారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఊపిరి నిలబడాలంటే ప్యాకేజీలు సరిపోవని అన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం లేదని ప్రకటించాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కి సొంత ఇనుప గనులు కేటాయించాలి సొంత బొగ్గు గనులు ఉండాలి రైల్వే వ్యాగిన్స్ కేటాయించాలి. మూసి వేసిన బ్లాస్ట్ ఫర్నేస్ ని ప్రారంభించాలి. సెప్టెంబర్ నుండి బకాయి పడిన ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి. ప్రైవేటు కంపెనీల అప్పులు మాఫీ చేస్తున్నట్లు విశాఖ స్టీల్ అప్పులను మాఫీ చేయాలి. గంగవరం పోర్టులో అదానీ అడ్డంకులు తొలగించాలి. కూటమి ఎంపీల మద్దతుతో ఊపిరి పోసుకున్న మోడీ ప్రభుత్వ ఇకనైనా ఆంధ్రప్రదేశ్ ప్రజలను మోసం చేయడం అపాలని వెంకన్న డిమాండ్ చేసారు,మేక పోతును బలి ఇచ్చే ముందు దాన్ని ముస్తాబు చేసినట్టే అందువల్ల ఇందులో ఒక్క పైసా కూడా ఉద్యోగుల ఈ ప్యాకేజీ సొమ్ము నుంచి జీతాలు చెల్లించడానికి వీలు లేదన్నారు. కేవలం 0.5 మిలియన్ టన్నుల కెపాసిటీ కలిగిన కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య స్టీల్ ఎ÷-లాంట్ కు 15 వేల కోట్ల రూపాయల సహాయాన్ని అందించిన కేంద్ర ప్రభుత్వ దానికి ఎటువంటి షరతులూ విధించ లేదన్నారు. కానీ దానికి పదిహేను రెట్లు విశాఖ స్టీల్ ఎ÷-లాంట్ పెద్దదని తెలిపారు అంటే 7.3 మిలియన్ టన్నుల కెపాసిటీ వున్న విశాఖ ఉక్కుకు మాత్రం కేవలం 11,440 కోట్ల రూపాయల సహాయం అందిస్తూ సవాలక్ష నిబంధనలు విధించిందని తెలిపారు. పైగా ముడి సరుకులు కొనడానికి కూడా ప్యాకేజీ సొమ్ము వినియోగించరాదని, స్పష్ట మైన ఆదేశాలు ఉన్నాయన్నారు,÷కేంద్రం అందిస్తున్న ఈ ప్యాకేజీ వెనుక వున్న మతలబును మడత పెట్టి కూటమి నాయకులు ప్రజలను నిలువునా ముంచే యదానికి సిద్ధపడు తుందని అన్నారు. కేవలం విశాఖ ఉక్కును కొనుక్కునే ప్రైవేట్ పార్టీ సౌలభ్యం కోసమే కేంద్రం ఈ ప్యాకేజీ ని ప్రకటించిందన్న విషయం తెలుసుకున్న నాడు తెలుగు ప్రజలు గుండెలు బాదు కోవలసి వస్తుందని అన్నారు. కేంద్రం ప్రకటించిన సాయం కేవలం అంకెల గారడీ తప్ప విశాఖ ఉక్కు రివైవల్ కు ఏ మాత్రం ఉపయోగ పడే అవకాశం లేనే లేదన్నారు.గతంలో ఉక్కు మంత్రిత్వ శాఖ ఇచ్చిన రు.500 కోట్లు ఈక్విటీ, ఆర్థిక శాఖ ఇచ్చిన రు.1,140 కోట్ల రుణాన్ని కలుపుకొని ఇప్పుడు రు.11,440 కోట్ల ప్యాకేజీని కేంద్రం ప్రకటించిందన్నారు. అంటే ఇప్పుడు కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ మొత్తంలో గతంలో ఇచ్చిన 1640 కోట్లను కలిపేసిందని తెలిపారు అంటే ఇప్పుడు ఇవ్వనున్నది రూ.9800 కోట్లు మాత్రమే. ఇది కూడా ఇప్పటికిప్పుడు కేంద్రం ఇవ్వదన్నారు మార్చి నెలాఖరు లోపల రు.6,800 కోట్లు మాత్రం విడుదల చేస్తారని, ఇందులో సుమారు రు.5 వేల కోట్లు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు గాను చెల్లించడానికే. ఉపయోగించ వలసి ఉంటుందని అన్నారు ఈ విధంగా కేంద్రం ఇప్పుడు,ఇవ్వనున్న రూ.9800 కోట్లలో 2025 డిసెంబరు నాటికి 7,350 కోట్లు రూపాయలు కేవలం బ్యాంకులకే కట్టల్సి ఉంటుందని తెలిపారు. ఇది కాకుండా పాత బాకీల చెల్లింపులు అంటూ రు.1400 కోట్లు టాటా మరో రు.500 కోట్లు వీఆర్ఎస్ కింద చెల్లించి 600 మంది ఉద్యోగుల్ని ఇంటికి - పంపించేయాలని చూస్తుందని తెలిపారు ఈఏడాది చివరకు ఎలాగూ 1200 మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయబోతున్నారని తెలిపారు. వారికి రు. 1500 కోట్లు వరకూ చెల్లించాలని అన్నారు. దీంతో దాదాపు 2 వేల మంది ఉద్యోగులు బైయటకు వెళ్లి పోతారని తెలిపారు. మరో 2000 మంది కాంట్రాక్టు కార్మికుల్ని ఈ ఏడాది చివరి కల్లా తొలగించాలని పక్రియ వెంటనే ప్రారంభించాలన్న ఆదేశాలు కూడా కేంద్రం ఇచ్చేసిందన్నారు. ఈమేరకు ఇర్చార్జి సీఎండీ సర్సేనా అప్పుడే 2 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఉద్వాసన పలకడానికి కసరత్తు ప్రారంభించేసారని అన్నారు. కేంద్రం ప్రకటించిన 11,440 కోట్ల ప్యాకేజీకి ఇవన్నీ షరతులు అన్న విషయాన్ని ప్రజా ప్రతినిధులు గుర్తు పెట్టుకోవాలి. కానీ ఇక్కడి ప్రజా ప్రతినిధులు ప్యాకేజీ సూపర్ అంటూ ప్రజల్ని మోసం చేస్తున్నారని తెలిపారు. ఇక కేంద్రం ప్రకటించిన రు.11,440 కోట్లలో నాలుగు నెలలగా జీతాలు లేకుండా. అలమటిస్తున్న ఉద్యోగులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడానికి వీలు లేదని హుకుం జారీ అయ్యిందన్నారు అంతే కాదు ముడి సరుకులు కొనడానికి (వర్కింగ్ క్యాపిటల్) కూడా ఈ సొమ్మును వినియోగించడానికి వీలు లేదన్నారు. ప్యాకేజీ సొమ్ము మొత్తం స్టబెర్స్ పాత బకాయిలు తీర్చడానికి, బ్యాంకు బకాయలు కట్టడానికి, వీఆర్ఎస్ చెల్లింపులకు మాత్రమే ఖర్చు చేయాలని తెలిందన్నారు. అయితే మరి వర్కింగ్ కాపిటల్ లేకుండా వచ్చే ఆగష్టు నాటికి విశాఖ ఉక్కు ఎలా నడుస్తాయో కేంద్రంలోని పెద్దలకే తెలియాలి. ముడి సరుకుల కొనుగోలుకు అవసర మయ్యే పర్కింగ్ కాపిటల్క్ ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదన్నారు.కావలసిన స్వంత ఘనుల విషయం ప్రస్తావించ లేదన్నారు ఇక విశాఖ ఉక్కు కోసం వేల ఎకరాల భూముల్ని ఇచ్చిన నిర్వాసితుల గురించి అసలు ప్రస్తావనే లేదన్నారు. వారికి ఇవ్వాల్సిన ఉద్యోగాల గురించి ఎటువంటి ప్రకటనా లేదన్నారు. పైగా ఇప్పటికే కాంట్రాక్టు ఉద్యోగాలు చేస్తున్న నిర్వాసితుల్ని తొలగించే పక్రియను మొదలెట్టేశారని ముఖ్యంగా విశాఖ ఉక్కులో నూరు శాతం పెట్టుబడుల ఉపసంహరణకు 2021లో కేంద్ర కాబినెట్ చేసిన తీర్మానాన్ని ఇప్పటికీ రద్దు చేయలేదన్నారు. అంటే విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోవటం లేదనే భరోసా లేనే లేదన్నారు.2021 తీర్మానం రద్దు కానంత వరకూ విశాఖ ఉక్కు మెడపై ప్రైవేటీకరణ కత్తి ఉన్నట్టేనని తెలిపారు ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా, ఉన్న ఉద్యోగుల్ని భారీగా తొలగించి, స్వంత ఘనులు ఇవ్వకుండా, వర్కింగ్ కాపిటల్ లేకుండా, పెట్టుబడుల ఉపసంహరణ తీర్మానాన్ని రద్దు చేయకుండా విశాఖ ఉక్కు రివైవల్ ఎలా అవుతుందో? కూటమి పెద్దలు ప్రజలకు వివరించాలి కోరారు.ఇంత పెద్ద మొత్తంలో ప్యాకేజీ ఇచ్చినా విశాఖ ఉక్కు నష్టాల్లో వుంది గనుక దీన్ని ప్రైవేట్

# కేసీఆర్ పాలనలో హ్యాపీగా కార్మికులు

హైదరాబాద్,:ఈ రాష్ట్రంలో పని చేసే కార్మికుల అభివృద్ధి కోసం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. సఫాయి అన్న.. నీకు సలాం అన్న సీఎం ఈ దేశంలో ఎవరూ లేరు.. కేవలం కేసీఆర్ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ హమాలీలు, ఆటో డ్రైవర్ల కోసమే కాదు.. అందరి కోసం పని చేశారు. కార్మికుల ఇబ్బందులు, చికాకులు పరిష్కరించేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు. జీహెచ్ఎంసీలో సఫాయి కార్మికులకు మూడు సార్లు జీతాలు పెంచారు. తెలంగాణ ఏర్పడక ముందు నాటి ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లను గుర్రాలతో తొక్కించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వారిని పెద్ద మనసుతో ఆశీర్వదించింది. అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచారు. మినీ అంగన్‌వాడీలకు రూ. 2200 ఉంటే రూ.7800 చేశారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ఆశా వర్కర్ల పట్ల పోలీసుల అసభ్యంగా ప్రవర్తించారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిరిగానే పోలీసులు కూడా ప్రవర్తించారు. ఆశావర్కర్లకు జీతాలు రూ. 2500 ఉంటే రూ. 9750 దాకా తీసుకువెళ్లాం. ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా జీతాలు పెంచినం. అన్ని రంగాల్లో పని చేసే కార్మికులను గుండెల్లో పెట్టుకున్నామని కేటీఆర్ తెలిపారు. హోంగార్డుల విషయం బాధాకరం. మొన్న ఒక హోంగార్డు కలిసి కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నడు. రూ. 9 వేలు ఉండే జీతాన్ని రూ. 25 వేలు చేసిండు కేసీఆర్.. ఆయన దేవుడు. ఎందుకు ఓడగొట్టారు. ఆయన ఉంటే మాకు ఇంకా లాభం జరిగేది. పోలీసులతో సమానంగా పే స్కేలు వచ్చేది.. మూడు పూటల అన్నం తింటున్నాం అంటే కేసీఆర్ పుణ్యమే అని ఆ హోంగార్డు చెప్పి బాధపడ్డాడని కేటీఆర్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం వేతనాలు పెంచారు. దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్న ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులే. ఇది చిన్న విషయం కాదు. కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేశాం. అలాగే నాలుగున్నర లక్షల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు ఇచ్చాం. 26 లక్షల మంది ప్రయివేటు డ్రైవర్లకు 5 లక్షల జీవిత బీమా ఇచ్చారు కేసీఆర్. వైద్య రంగం, మున్సిపల్ రంగంలో జీతాలు పెంచుకుంటూ పోయామని కేటీఆర్ తెలిపారు.

# సైఫ్ కేసులో కోర్టులో ఇద్దరు లాయర్ల మధ్య గొడవ

ముంబై, బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ముంబై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిందితుడు షెహజాద్ మహమ్మద్ తరఫున వాదించేందుకు ఇద్దరు లాయర్లు గొడవపడ్డారు. దీంతో న్యాయమూర్తి వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. ఇంతకూ ఏం చేశారంటే.. సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడు షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్ (30)ను ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన అతడిని థాణేలో అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ముంబైకి తరలించారు. అనంతరం భారీ బందోబస్తు నడుమ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరపరిచారు. నిందితుల బోనులో నిలబడి ఉన్న షెహజాద్‌ను.. పోలీసులపై ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు. దానికి అతడు వ్యతిరేకంగా సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో షెహజాద్ వద్దకు వెళ్లిన ఓ లాయరు.. అతని తరఫున తాను వాదిస్తానంటూ వకాలత్ పత్రంపై సంతకం చేస్తున్నాడు. అంతలోనే మరో న్యాయవాది కూడా నిందితుని వద్దకు వెళ్లి తాను వకాల్తా పుచ్చుకుంటానంటూ సంబంధిత పత్రాలపై సంతకం కోసం ప్రయత్నించాడు. దీంతో ఇద్దరు లాయర్లు కోర్టు హాలులోనే వాదులాడుకున్నారు. దీంతో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి.. ఇద్దరూ ఒక టీమ్‌గా అతని తరఫున వాదనలు వినిపించవచ్చని తెలిపారు. దానికి ఆ ఇద్దరు లాయర్లు కూడా సమ్మతించారు. కాగా, నిందితుడికి న్యాయస్థానంలో హాజరుపర్చగా ఐదు రోజుల పోలీస్ కస్టడీకి పంపిందని, ఈ దాడి వెనుక అంతర్జాతీయంగా ఏదన్నా కుట్ర ఉందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి ఐదు నెలల క్రితం భారత్‌కు అక్రమంగా వచ్చిన నిందితుడు తన పేరును విజయ్ దాస్‌గా మార్చుకున్నాడు. తర్వాత హౌస్ కీపింగ్ సహా చిన్నచిన్న పనులు చేసేవాడు. ఆ ఇల్లు నటుడు సైఫ్ అలీఖాన్‌దని తనకు తెలియదని, కేవలం చోరీ కోసమే అందులో ప్రవేశించినట్టు నిందితుడు తెలియజేసినట్టు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

# పక్కా వ్యూహం?

అమరావతి,సీఐడీ మాజీ చీఫ్ సునీల్ అవినీతికి పాల్పడ్డారంటూ ప్రభుత్వం మరో కేసును తెరపైకి తెచ్చింది. పోలీసు హౌసింగ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టరుగా ఉండగా, డ్యాష్ బోర్డు తయారుచేసేందుకు టెండర్లలో అక్రమాలకు పాల్పడ్డారని, నిబంధనలకు విరుద్ధంగా మూడు కోట్ల రూపాయలు చెల్లించారని ఆరోపిస్తూ మరో అభియోగం నమోదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఆయన సర్వీసు నిబంధనలు ఉల్లంఘించారని ఆరోపిస్తూ విచారణకు ఆదేశించింది. తాజాగా అవినీతికి పాల్పడ్డారంటూ మరో అంశాన్ని వెలుగులోకి తేవడం ద్వారా ఎట్టిపరిస్థితుల్లోనూ సునీల్ కుమారును విడిచిపెట్టే ప్రసక్తే లేదని సంకేతాలు పంపినట్లైంది.డిప్యూటీ స్పీకర్ రఘురామక్రిష్ణంరాజుపై కస్టోడియల్ టార్చర్ కేసులో సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమారుకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లభించకపోవడంతో ప్రభుత్వం ప్లాన్ బీ అమలు చేయాలని చూస్తోంది. గత ప్రభుత్వంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించి టీడీపీ నేతలు, కార్యకర్తలను వేధింపులకు గురిచేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐపీఎస్ అధికారి సునీల్ కుమారుపై ఎలాగైనా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం పంతం పట్టిందని అంటున్నారు. కార్యకర్తలు, నాయకుల నుంచి విపరీతమైన ఒత్తిడి ఉండటం, రఘురామ కేసులో ఆయనకు వ్యతిరేకంగా ఆధారాలు లభించకపోవడంతో కొత్త కేసులు తెరమీదకు తెస్తోందని అంటున్నారు. దీంతో గత ప్రభుత్వంలో సునీల్ కుమారు జరిపిన ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలపై ఆరా తీస్తోంది.ప్రస్తుతం వీఆర్ లో ఉన్న సునీల్ కుమారుపై ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉంది. గత ప్రభుత్వంలో అప్పటి వైసీపీ పెద్దలు చెప్పినట్లు చేశారని అభియోగాలు ఎదుర్కొంటున్న సునీల్ కుమార్ ను తేలిగ్గా వదలొద్దని కూటమి పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఆయనకు వ్యతిరేకంగా బలమైన కేసులు పెట్టేలా వ్యూహం రచిస్తోంది. రఘురామ కేసు ఒకవైపు విచారణలో ఉండగానే, అవినీతి వ్యవహారాలను తవ్వితీస్తోంది. ఇందులో భాగంగా గతంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, వైస్ చైర్మనుగా పనిచేసిన సునీల్ కుమార్ ఆ శాఖకు డాష్ బోర్డు తయారు చేయించాలని నిర్ణయించారు.

# మున్సిపల్ చైర్మన్ లకి ప్రత్యక్ష ఎన్నికలు..




హైదరాబాద్, తెలంగాణలోని మున్సిపల్ చైర్మన్ పదవులకు నేరుగా ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర మునిసిపల్ ఛాంబర్స్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు కోరారు. హైదరాబాద్ లోని మున్సిపల్ చాంబర్స్ కార్యాలయంలో నేడు కార్యవర్గ సమావేశం జరిగింది.అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చైర్మన్ మేయర్ పదవులకు నేరుగా ఎన్నికలు నిర్వహించడం వల్ల మేరుగైన అభివృద్ధిని సమర్ధంగా విధులు నిర్వహంచే అవకాశం ఉందని తెలిపారు. రాజీవ్ గాంధీ,స్థానిక సంస్థలను బలోపేతం చేయాలనే సంకల్పంతో 73,74వ రాజ్యాంగ సవరణ చేస్తే దానిక తూట్లు పోడిచే విధంగా గతంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం పురపాలక, పంచాయతీ రాజ్ నూతన చట్టాలను తీసుకువచ్చి స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు.చట్ట సవరణ వల్ల స్థానిక సంస్థలు నిర్వీర్యం అయి పాలకవర్గాలు ఉత్సవ విగ్రహాలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల అధికారాలను ప్రభుత్వ అధికారులకు అప్పగించి పాలక వర్గాలపై ఆజాయాయిషి చేసే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు విఫలమై భవిష్యత్లో ద్వితీయ శ్రేణి నాయకత్వం రాకుండా పోయే ప్రమాదం ఉందని అన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్నా పురపాలక చట్టాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు.

నిధులు విడుదల రేవంత్ కు ధన్యవాదాలు

తెలంగాణ చరిత్రలో గత ప్రభుత్వ విధానాల వల్ల పురపాలికలు చితికి పోయాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత పదకొండు ఎండ్లుగా పేరుకుపోయిన టిడిఎస్ ను సుమారు రూ.2700,కోట్ల విడుదల చేసి ప్రజాపాలనకు దిక్సూచిగా నిలిచారని అన్నారు. ఈ నిధుల విడుదల పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తు సిఎం కృతజ్ఞతలు తెలియజేశారు ఇట్టి నిధులను తక్షణం అభివృద్ధికి వెచ్చించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. ఈ నిధులు రాష్ట్ర ఖజానా ద్వారా కాకుండా మున్సిపల్ సాధరణ నిధుల కింద ఖర్చు చేసే వేసులుబాటు కల్పించాలని సిఎం రేవంత్ రెడ్డిని కోరారు.

పన్నుల వేసే అధికారం..

పట్టణ ప్రగతి నిధులు 20నెలలుగా విడుదల కాకపోవడం వల్ల వాటిని ఆధారంగా చేసుకోని చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడంలో ఇబ్బందు జరుగుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పరిశీలించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పన్నులు విధించే అధికారం ఒకే విధంగా ఉండకుండా పన్నులను ఖరారు చేసే అధికారాలు స్థానిక సంస్థలకు ఇవ్వాలని సీఎం ను కోరారు. విలేకరుల సమావేశంలో చాంబర్స్ ప్రతినిధులు అల్లపల్లి నరసింహ, శాగంటి అనసూయ తదితరులు పాల్గోన్నారు.

# దావోస్ పర్యటనలతో సాధించేదేమిటి ?

హైదరాబాద్,దావోస్‌లో ప్రపంచ పెట్టుబడుల సదస్సుకు ఇరు తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడులు వెళ్లారు. పెట్టుబడులే లక్ష్యంగా వీరు అడుగులు వేస్తున్నారు. హైదరాబాద్‌కు ఉన్న బ్రాండ్‌తో తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇది ఆయనకు రెండో పర్యటనగా కలసివస్తుందేమో చూడాలి. చంద్రబాబుకు ప్రపంచంలో సొంత బ్రాండ్ ఇమేజ్ ఉంది. అమరావతి కొత్త రాజధానిగా అవతరించినందున ఆయనకు సానుకూలత కాగలదు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే.. సింగపూర్‌లా రాష్ట్రాలను అభివృద్ది చేసేందుకు స్థానికంగా ఉన్న యువతకు ప్రోత్సాహం ఇవ్వాల్సి ఉంటుంది. స్థానిక వనరులు, స్థానిక యువతను ప్రోత్సహిస్తే ఆదాయవనరులు కూడా పెరగగలవు. కానీ మేక్ ఇన్ ఇండియా అంటున్న ప్రధాని కూడా పెద్ద ఎత్తున ఈ రకమైన ప్రోత్సాహం ఇవ్వడం లేదు. దేశీయంగా యువతకు ఉపాధి కల్పించడానికి బ్యాంకులను ప్రోత్సహించాలి. విరివిగా రుణాలు ఇవ్వాలి. వ్యవసాయం, వ్యవసాయాధిరత పరిశ్రమలు, కోళ్లు, పశువులు, గొర్లు, మేకల పెంపకం వంటి వాటికి అవసరమైతే వడ్డీరహిత రుణాలను ఇవ్వగలగాలి. యువత విదేశాలవైపు చూడకుండా ఉండాలంటే ఇలాంటి స్వయం ఉపాధి రంగాలను ప్రోత్సహించాల్సి ఉంటుంది. విదేశీ కంపెనీలను, పెట్టుబడులను ఆహ్వానించి పెద్ద ఎత్తున ఏదో చేయాలన్న ఆలోచన కూడా సరికాదు. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు ఎపిలో కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయబోతు న్నారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. అయితే అవి ఎలా వున్నా.. స్థానికంగా ఉన్న వనరులతో స్థానిక యువతను ప్రోత్సహించేందుకు ప్రణాళికలు సిద్దం చేయాలి. తక్కువ పెట్టుబడులతో పెద్ద మొత్తంలో ఉపాధికి అవకాశాలను అన్వేషించాలి. విదేశీ పెట్టుబుడులు అనగానే ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలు తునమీదకు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ఆహార ఉత్పత్తులను తగ్గించడం ఇవన్నీ కూడా ఆందోళనకర అంశాలు మారుతున్నాయి. ప్రధానంగా వ్యయసాయ భూములను బలవంతంగా లాక్కుని కార్పోరేట్లకు కట్టబెడు తున్నారు. ఇలాంటి పరిస్థితి పోవాలి. కొత్తగా తీసుకొచ్చే పరిశ్రమలు, పారిశ్రామిక పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. కానీ ఎక్కడా అలాంటిదేమీ కనిపించడం లేదు. విదేశీ పెట్టుబడులకు దాసోహమంటూ ఇక్కడి వనరులను దోచిపెడుతున్న పాలకులు దేశీయంగా యువత ముందుకు వస్తే



మాత్రం..ఓ పైసా వడ్డీకూడా తగ్గించడం లేదు. ఉచిత విద్యుత్ ఇవ్వరు. భూమలు ఇవ్వరు. నీరు ఇవ్వరు. దీనిని బట్టి ప్రపంచీకరణ ప్రభావంతో దేశంలో విదేశీయుల పెత్తనం పెరగిపోవడం ఖాయం. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాల్సి ఉంది. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ అవసరమే. అయితే అది ఉన్న ఉపాధిని దెబ్బతీయకుండా చూసుకోవాలి. సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు చూస్తున్నాయి. తమపై భారం లేకుండా చూడాలని చూస్తున్నారు. జీతాలు, పెన్షన్లు తగ్గించుకోవాలన్న క్రమంలో ప్రైవేట్ పెట్టుబడులకు పెద్దపీట వేస్తున్నారు. దావోస్ లాంటి సదస్సులు ఇందుకు వేదికగా మారుతున్నాయి. ప్రభుత్వం ప్రైవేటు ఇండిస్ట్రియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. అయితే ఇదంతా చేసే బదులు ఎవరికి వారు స్వయం ఉపాధి రంగాన్ని ఎంచుకుంటే బ్యాంకు రుణాలు, నీటి సదుపాయాలు, విద్యుత్ సౌకర్యాలు ఇస్తే దేశీయంగానే చిన్నచిన్న పరిశ్రమలు స్థాపన సులువు కాగలదు. దానికి దావోస్ లాంటి సదస్సులకు వెళ్లడం, వెంపర్లాడడం, బతిమాడం వంటివన్నీ చేయకుండానే లక్ష్యం నెరవేర్చుకోగలం. కేవలం ఉన్న మానవ వనరులను,సహజ వనరులను ఉపయోగించుకుంటే మంచిది. అలాంటి ప్రయత్నాలు మొదలు కావాలి. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు లాంటి వారు ఇలాంటి ప్రయత్నాలు చేయాలి. దేశీయంగా రుణాలను ఇచ్చేందుకు పారదర్శక విధానం అమలు కావాలి. తక్కువ వడ్డీలకు రుణాలు ఇచ్చేలా పాలసీలను రూపొందించాలి. అప్పుడే ఉపాధి పెరుగుతుంది. పరిశ్రమలు వస్తాయి. స్వయం ఉపాధి పెరుగుతుంది. ద్రవ్యోల్బణం తగ్గుతుంది. దావోస్ పర్యటనలతో డబ్బు వృధా చేసుకునే బదులు దేశీయ ఆలోచనలతో ముందుకు నడవడం అవసరం.

# మెడికల్ టెర్రర్! విస్తరిస్తున్న డ్రగ్ మాఫియా

సెంట్రల్ డెస్క్: తెలంగాణ రాష్ట్రంలో నకిలీ, కల్తీ మెడిసిన్స్? అమ్మకాలు పెరిగినట్టు తెలుస్తోంది. డ్రగ్స్? స్టాండర్డ్స్?పై తనిఖీలు చేయకపోవడం.. మెడిసిన్స్? మూలాలను వెతకకపోవడంతో కల్తీ పెరిగినట్టు సమాచారం. ఈ మధ్య డ్రగ్? ఆఫీసర్లు చేస్తున్న తనిఖీల్లో పలు లోపాలు బయటపడుతుండడమే నిదర్శనం. తెలంగాణపై డ్రగ్స్ మాఫీయా, మత్తు పదార్థాల మాఫీయా, కల్తీ మాఫీయా ఇలా ఎన్నో రకాలుగా దాడులు జరుగుతున్నాయి. దానికి తోడు నాణ్యత లేని, నకిలీ మందులు కూడా చాప కింద నీరులా విస్తరిస్తున్నాయి. ప్రజల ప్రాణాలను రక్షించే మందులకు సంబంధించిన నేరాల సంఖ్య పెరుగుతోంది. తెలంగాణ స్టేట్ డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ 2024లో ?7.46 కోట్ల విలువైన నాణ్యత లేని, కాలం చెల్లిన మందులను సీజ్ చేసింది. మెడికల్ షాపులు నిబంధనలు ఉల్లంఘించిన నేరాలు కూడా బాగా పెరిగాయి. 2023లో 56 కేసులుండగా.. అవి ఏడాదిలో 573కి పెరిగాయి. కల్తీ మందులను అడ్డుకోవలంటే క్షేత్ర స్థాయి నుంచి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ఇట్లా పైపైన తనిఖీలు చేస్తే ప్రయోజనం ఉండదని పరిశీలకులు చెబుతున్నారు.

ఆ మందులన్నీ నాణ్యమైనా?

మార్కెట్‌లో లభ్యమవుతున్న మందులు నాణ్యమైనా? అనే సందేహాలు ప్రతి ఒక్కరిలో ఉన్నాయి. ఈ సందేహం ఇప్పుడే కాదు.. ఎప్పటి నుంచో ఉంది. మార్కెట్?లో స్టాండర్డ్ కంపెనీలు, జనరిక్, చిన్న కంపెనీలు, వాటికి తోడు కార్పొరేట్ ఫార్మసీల ద్వారా మందులు విక్రయిస్తున్నారు. హైదరాబాద్ లాంటి ప్రధాన నగరాల్లో కార్పొరేట్ ఫార్మసీలు, హాస్పిటల్ అటాచ్డ్ ఫార్మసీలు ఎక్కువగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ మెడికల్ స్టోర్స్ ఉన్నాయి. ప్రభుత్వం అనుమతితో ఏర్పాటు చేసిన ఈ మందుల దుకాణాల ద్వారా విక్రయిస్తున్న మందులు ఎంత వరకు నాణ్యంగా ఉంటున్నాయి అనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎందుకంటే వాటి నాణ్యతను నిపుణులు తప్ప మరెవరూ చెప్పలేరు. గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ స్టోర్స్ యాజమానులు చెప్పిన ప్రకారం మందులు వినియోగిస్తుంటారు. నగరాల్లో ఆస్పత్రుల్లో ఆయా డాక్టర్లు రాసే మందులు అక్కడ ఉన్న మెడికల్ స్టోర్స్?లో తప్ప మరెక్కడా దొరకవు. కార్పొరేట్ ఫార్మసీలోనూ వారు సొంత బ్రాండ్‌పై ఉన్న ఉత్పత్తులను మాత్రమే విక్రయిస్తుంటారు. దీంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది.

సరైన వేతనాలు ఇవ్వలేక..

హైదరాబాద్ నగరంతోపాటు తెలంగాణ అంతటా అనేక మెడికల్ స్టోర్స్‌లో క్వాలిఫైడ్ పర్సన్స్ లేరన్నది వాస్తవం. ఫార్మసిస్ట్ లేకుండా, బిల్లు ఇవ్వకుండా ఏ



మెడికల్ స్టోర్స్ నుంచి మందులు విక్రయించకూడదనే నిబంధన ఉంది. అలా బిల్లులు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. అనేక మెడికల్ స్టోర్స్‌ల్లో క్వాలిఫైడ్ పర్సన్స్ కానరారు. ఎందుకంటే అందుకు తగిన వేతనాలు ఇవ్వకపోవడం కూడా దీనికి కారణంగా తెలుస్తోంది.

టెన్త్ చదివిన వారితో మందుల విక్రయం..

సాధారణంగా డి–ఫార్మసీ, బీ–ఫార్మసీ అభ్యర్థులు ఇచ్చిన సర్టిఫికేట్లు ఆధారంగా మెడికల్ స్టోర్స్‌కు అనుమతి లభిస్తుంది. అందులో ఉద్యోగం చేస్తామని ఆయా అభ్యర్థుల నుంచి డిక్లరేషన్ తీసుకున్న తర్వాత డ్రగ్ కంట్రోల్ పరిపాలన అధికారులు లైసెన్స్ మంజూరు చేస్తారు. కానీ అనేక మెడికల్ స్టోర్స్‌ల్లో లైసెన్స్ కోసం ఫార్మసీ సర్టిఫికేట్ ఇచ్చే వ్యక్తులు ఉండడం లేదు. ఈ విషయం అధికారులకు కూడా తెలుసు. అయినా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఇక.. టెన్త్ చదివిన వారిని నియమించుకుని చాలాచోట్ల మందుల విక్రయం చేస్తున్నట్టు అధికారుల తనిఖీల్లో బయటపడింది.

క్వాలిఫైడ్ పర్సన్స్ ఉంటే..

అయితే.. క్వాలిఫైడ్ పర్సన్స్ లేకపోవడంతో ఇక్కడ రెండు తప్పిదాలు జరుగుతున్నట్టు తనిఖీల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం కొంత మంది డాక్టర్లు బ్రాండెడ్ పేరుతో ప్రిస్క్రిప్షన్? ఇస్తారు. అందులో ఉన్న కాంపొజిషన్ మందులు గురించి ఇచ్చేవారికి తెలియకపోవడంతో ఎలా వాడాలో కూడా చెప్పకపోవడంతో పేషెంట్స్? తమకు నచ్చిన రీతిలో వినియోగిస్తున్నారు. దీనివల్ల కూడా అనేక సమస్యలు ఏర్పడుతున్నట్టు వైద్య అధికారులు చెబుతున్నారు. అదీగాక మందుల కాంపోజిషన్ తెలియకపోవడంతో ఓవర్ లుక్‌లో డాక్టర్ రాసే మందులకు బదులు వేరే వాటిని కూడా ఇచ్చే ప్రమాదం ఉంది. క్వాలిఫైడ్ పర్సన్స్ ఉంటే పేషెంట్స్?కి తగిన సలహాలిచ్చే అవకాశం ఉంటుంది.

# 'తిక్క'మాటలు కావు.. 'లెక్క' పెట్టుకోవాల్సిందే బాబూ..!



అమరావతి,రాజకీయ పార్టీల భవితవ్యం ఏంటనేది.. ఎవరో ఎక్కడి నుంచో వచ్చి.. సర్వేలు చేసి చెప్పాల్సిన అవసరం లేదు. క్షేత్రస్థాయిలో నాయకులు చేసే కామెంట్లు.. వారు వ్యవహరిస్తున్నతీరు వంటివి.. పార్టీ భవిష్యత్తును, బలాన్ని కూడా చెప్పేస్తాయి. గతంలో అంతా బాగానే ఉందని.. తాము ఇచ్చిన సంక్షేమం ఎవరూ ఇవ్వడం లేదని కాబట్టి.. ప్రజలు గుండుగుత్తగా తమతోనే ఉన్నారని వైసీపీ చెప్పింది. కానీ.. క్షేత్రస్థాయిలో నాయకులు మాత్రం ఏమంత బాగాలేదని చెప్పుకొచ్చారు.కానీ, వైసీపీలో మార్పు రాలేదు. ఫలితం ఎలాంటిదో తర్వాత కానీ అనుభవంలోకి రాలేదు. ఇక, తాజాగా మరీ అంత రేంజ్‌లో కాకపోయినా.. కూటమి సర్కారుకు నేతృత్వం వహిస్తున్న టీడీపీలో క్షేత్రస్థాయి నాయకులు రగిలిపోతున్నారు. ఇప్పటికే చాలా మంది బయట పడిన విషయం తెలిసిందే. తాజాగా ఇప్పుడు ఏకంగా ఓ జిల్లా టీడీపీ చీఫే రెచ్చిపోవడం మరింత చర్చకు దారితీసింది. "టీడీపీ జెండా కోసం జైలుకు వెళ్లినోళ్లు, రోడ్డుపై పోరాడినోళ్లు, ఆర్థికంగా నష్టపోయినోళ్లకు అన్యాయం జరుగుతోంది" అని సీమకు చెందిన కీలక నేత బహిరంగ వ్యాఖ్యలు చేశారు.గత కొన్నాళ్లుగా సీమలోని పలు జిల్లాల్లో బీజేపీ వర్సెస్ టీడీపీ నేతల మధ్య వివాదాలు సాగుతున్నాయి. అయితే.. ఇంతగా ఎవరు బయట పడలేదు. తాజాగా కర్నూలు జిల్లా టీడీపీ చీఫ్, సీనియర్ నాయకుడు తిక్కారెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పార్టీ కోసం పనిచేసిన తమకు ఏం చేశారని.. ఆయన ప్రశ్నించారు. అంతేకాదు.. 'అంత కష్టపడి అధికారంలోకి వస్తే జిల్లాలో కొందరు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలుగా చెప్పుకొనే వాళ్లు చేస్తున్నదేమిటి? టీడీపీ జెండాలు మోసిన కార్యకర్తల దగ్గర లంచాలు తీసుకుని పనులు చేస్తున్నారు' అని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు.అంతేకాదు.. "వైసీపీ నాయకుల అరాచకాలపై ప్రాణాలకు తెగించి పోరాడి, బుల్లెట్ గాయాల పాలయ్యాను. ఓడిపోయి ఇన్‌చార్జిలుగా చెప్పుకునేవాళ్లు ఎంపీని కట్టడి చేస్తారా? చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌కు తెలిస్తే బాధపడతారు. ఎన్నికల్లో ఏ లీడరు ఎలా పనిచేశాడు? ఏ కార్యకర్త ఎలా కష్టపడ్డాడు? పని చేసినోళ్ల కు గుర్తింపు ఇస్తున్నామా..? ఆత్మపరిశీలన చేసుకోవాలి" అని తిక్కారెడ్డి నిప్పులు చెరిగారు. కట్ చేస్తే.. ఈ వ్యాఖ్యలు గతంలో వైసీపీలోనూ వినిపించాయి.కొందరికి పదవులు ఇవ్వడంపై అప్పట్లో సీనియర్లను పక్కన పెడుతున్నారన్న చర్చ జరిగింది. ఆ తర్వాత.. ఇది తీవ్ర అసంతృప్తికి దారి తీసింది. ఇది.. వైసీపీ పరాజయానికి అంతో ఇంతో పనిచేసింది. ఇక, ఇప్పుడు ఇదే సమస్య టీడీపీ ఎదుర్కొంటోంది. అయితే.. ఇది మొగ్గ దశలోనే ఉంది. కాబట్టి సాధ్యమైనంత వరకు దీనిని పరిష్కరిస్తేనే బెటర్ అనే సూచనలు వస్తున్నాయి. మరి చంద్రబాబు ఏం చేస్తారో చూడాలి.

# వెలుగులోకి సంచలన నిజాలు...



ముంబై: ముంబయ్‌లో ప్రముఖ నటుడు సైఫ్ అలీఖాన్‌పై ఓ దుండగుడు దాడి చేసిన ఘటన సంచలనం రేపిన సంగతి తెలిసిందే. నిందితుడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించి తాజాగా మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఆ దుండగుడు సైఫ్ ఇంట్లో చొరబడ్డాక ఆయనపై దాడి చేశాడు. ఆ సమయంలో అక్కడ నలుగురు మగ పనిమనుషులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఆ దుండగుడు, సైఫ్‌కు మధ్య ఫైట్ జరుగుతున్నప్పుడు ఆ నలుగురు ఆపేందుకు ప్రయత్నించలేదు. భయంతో అక్కడే దాక్కున్నారు. అయినప్పటికీ సైఫ్ అలీ ఖాన్ ఒక్కడే ఒంటరిగా ఆ దుండగుడితో పోరాడినట్లు ఓ జాతీయ మీడియా తెలిపింది. ఇదిలాఉండగా.. ఈ ఘటనపై మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ కూడా పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దుండగుడికి అది సైఫ్ అలీ ఖాన్ ఇల్లు అని తెలియదని పేర్కొన్నారు. " అతడు ఒక దొంగ. బంగ్లాదేశ్‌కు చెందినవాడు. ముందుగా కోల్‌కతాకు చేరుకొని ఆ తర్వాత ముంబయికి వచ్చాడు. దొంగతనం చేసేందుకు ఓ ఇంటిని ఎంచుకున్నాడు. ఇందులో భాగంగానే సైఫ్ ఇంట్లో చొరబడ్డాడు. అది సైఫ్ అలీ ఖాన్ ఇల్లు అన్న విషయం ఆ దొంగకు తెలియదు. విపక్ష పార్టీలు మా ప్రభుత్వం వైఫల్యం వల్లే దాడి జరిగిందని చెప్పడం సరైంది కాదు. ముంబైలో లా అండ్ ఆర్డర్ విఫలమైందని విపక్ష పార్టీలు పదే పదే ఆరోపణలు చేయడం సరికాదు. ఇలా విమర్శించడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని" అజిత్ పవార్ అన్నారు.మరోవైపు దీనికి సంబంధించి ముంబయి జోన్ 9 డీసీపీ దీక్షిత్ గెడం సైతం మీడియాతో మాట్లాడారు. " నిందితుడి పేరు మహ్మద్ షరీఫుల్ షెహజాద్. విజయ్ దాస్‌గా అందరికీ తన పేరు చెప్పుకుంటున్నాడు. 6 నెలల క్రితమే ఫేక్ పత్రాలతో ఇండియాలో చొరబడ్డాడు. కొన్నాళ్ల నుంచి ముంబయిలో ఓ బార్‌లో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. దొంగతనం చేసేందుకే సైఫ్ అలీఖాన్ ఇంట్లో చొరబడ్డాడు. కొన్నిరోజులు ఓ హౌస్ కీపింగ్ ఏజెన్సీలో కూడా పనిచేశాడు. ఆ సమయంలోనే సైఫ్ ఇంటికి వెళ్లినట్లు అనుమానాలున్నాయి. వీటికి సంబంధించిన ఆధారాలు స్వాధీనం చేసుకున్నాం. ప్రస్తుతం అతడిపై విచారణ జరుగుతోందని" దీక్షిత్ గెడం తెలిపారు.

## తెలంగాణలో బీర్ల సరఫరా పునరుద్ధరణ

హైదరాబాద్, తెలంగాణలో అతిపెద్ద బీర్ల తయారీ సంస్థ యునైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ (యూబీఎల్) సంస్థ బీర్ల సరఫరాను పునరుద్ధరించింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ హామీతో బీర్ల సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొంది. ధరల పెంపు, బకాయిలపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకుం టుందని తెలిపింది.గత రెండేళ్ల నుంచి రూ.702 కోట్ల బకాయిల్ని కార్పొరేషన్ విడుదల చేయకపోవడం, బీరు మూల ధరను సవరించాలని ఎన్నిసార్లు విన్నవించినా ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో బీర్ల సరఫరాను యూబీఎల్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో ఆరు బీర్ల తయారీ సంస్థలున్నా మార్కెట్లోకి వచ్చే వాటిలో 75 శాతం వాటా యూబీఎల్‌దే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడింది. దీంతో మద్యం ధరల పెంపు అంశంపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సిఫారసుల మేరకు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో యూబీఎల్.. సరఫరాను పునరుద్దరించింది.

# పవన్ భద్రత మాకు టాప్ ప్రయారిటీ

అమరావతి,డిప్యూటీ సీఎంగా కొనసాగుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ భద్రతకు తాము అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం అక్కర్లేదని కూడా ఆయన పేర్కొన్నారు. పవన్ సెక్యూరిటీలోకి ఓ నకిలీ ఐపీఎస్ ఎంట్రీ, ఇటీవలే మంగళగిరిలోని పవన్ ఇంటిపై డ్రోన్ ఎగిరిన వైనంపై జనసేన నుంచి ఫిర్యాదు అందిన నేపథ్యంలో డీజీపీ సోమవారం ఈ వ్యాఖ్యలు చేశారు. సోమవారం రాజమహేంద్రవరంలో ఓ కార్యక్రమానికి హాజరైన సందర్భంగా మీడియాతో మాట్లాడిన సందర్భంగా డీజీపీ ఈ వ్యాఖ్యలు చేశారు.అసలు పవన్ కల్యాణ్ ఇంటిపై డ్రోన్ ఎగిరిందా? లేదా? అన్నది కూడా తేలాల్సి ఉంది అని డీజీపీ అన్నారు. పవన్ ఇంటిపై డ్రోన్ ఎగిరిన విషయాన్ని కేవలం ఒక ఆర్ఎస్ఐ మాత్రమే చూశారన్నారు. దీనిపై ఇప్పటికే దర్యాప్తు చేస్తున్నామని, తాను అయితే 24 గంటల్లోనే విచారణ పూర్తిచేయాలని ఆదేశించానని, అయితే మరింత సమయం కావాలని లోకల్ పోలీసులు అభ్యర్థించారన్నారు. సోమవారం సాయంత్రానికి ఈ విషయంలో ఓ నిర్ధారణకు వస్తామని ఆయన తెలిపారు.ఇక పవన్ సెక్యూరిటీలో నకిలీ ఐపీఎస్ ఎంట్రీపై స్పందించిన డీజీపీ%ా% పవన్ భద్రతలో ఎలాంటి లోపం జరగలేదని తెలిపారు. విజయనగరం జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో పవన్ పర్యటించిన సందర్భంగా ఆ టూర్ ముగిసిన తర్వాత అక్కడ నకిలీ ఐపీఎస్ ప్రత్యక్షమయ్యాడన్నారు. అయినా నిర్దేశిత ప్రోగ్రాం ముగిసిన తర్వాత చోటుచేసుకున్న ఈ ఘటనను తాము అసలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదన్నారు. అయినా కూడా పవన్ డిప్యూటీ సీఎంగా



ఉన్న నేపథ్యంలో ఆయన భద్రతపై తామంతా సీరియస్ గా ఉన్నామని తెలిపారు.సోషల్ మీడియాలో నారా లోకేశ్ వర్సెస్ పవన్ కల్యాణ్ అన్నట్టుగా పెద్ద రచ్చ జరుగుతుందన్న విషయంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా%ా% ఆ విషయం ఇంకా తన దృష్టికి రాలేదని డీజీపీ అన్నారు. దీనిపై వివరాలు అడిగి తెలుసుకుంటానని తెలిపారు. ఇక సంక్రాంతి సందర్భంగా ఈ ఏడాది గతంలో కంటే అధికంగా కోడి పందేలు జరిగాయన్న విషయంపైనా డీజీపీ వెరైటీగా స్పందించారు. ఈ వ్యవహారం హైకోర్టు పరిశీలనలోనిదని ఆయన తెలిపారు. పందేలు ఎక్కువ జరిగాయా?తక్కువ జరిగాయా? అన్నది కాకుండా ఎన్ని కేసులు నమోదు అయ్యాయన్న విషయంపై హైకోర్టుకు తాము ఓ నివేదికను ఇవ్వనున్నట్లు డీజీపీ తెలిపారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com